## ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత : మంత్రి తలసాని



గోషామహెల్‌లోని కమ్యూనిటీహాల్‌లో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

గోషామహల్, మే 16 ప్రభాతవార్త : ప్రజల ఆరోగ్య సంరక్షణకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం గోషామహెల్ పరిధిలోని గన్‌ఫౌండ్రి నేతాజి కమ్యూనిటీహాల్‌లో, జాంభాగ్ డివిజన్‌లోని సుబాన్‌పురా కమ్యూనిటీహాల్‌లలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలను మంత్రి శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే రాజాసింగ్, ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్‌భేగ్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తరువాత ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పేద ప్రజలు అధికంగా నివసించే ప్రాంతాలలోనే ఈ బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రేటర్ పరిధిలో ఇప్పటికే 350.బస్తీ దవాఖానాల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. హైదరాబాద్ జిల్లాలో 153 ఉండగా మరో 14. బస్తీ దవాఖానాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడమే కాకుండా మందులు కూడా ఉచితంగానే అందజేస్తున్నామన్నారు. అవసరమైతే గాంధీ, ఉస్మానియా, నిమ్స్ ఆసుపత్రులకు రెఫర్ చేయడం జరుగుతుందన్నారు.



# హైదరాబాద్ వార్త



# వాట్సాప్ డిపి.. తస్మాత్ జాగ్రత్త

**రెచ్చిపోతున్న సైబర్ కేటుగాళ్లు ● డిపి ఫోటోలు తీసుకుని మార్ఫింగ్**

### నగ్నంగా మార్చి కుటుంబ సభ్యులకు పంపుతున్న వైనం

### డబ్బులు ఇవ్వకుంటే సోషల్ మీడియాతో పెడతామని బెదిరింపులు

హైదరాబాద్, మే 16, ప్రభాతవార్త: వాట్సాప్ డిపిలు పెడుతున్నారా.. అయితే జాగ్రత్తగా ఉండాల్సిదే.. ఇదే అదునుగా భావిస్తున్న సైబర్ కేటుగాళ్లు.. చిత్రాలను మార్ఫింగ్ చేస్తున్నారు. ఆపై వారిని బెదిరించి లొంగదీసుకోవడం లేదా లక్షల్లో డిమాండ్ చేయడం చేస్తున్నారు. ఇటీవల నగరానికి చెందిన ఓవ్యక్తి తన భార్యతో దిగిన చిత్రాన్ని వాట్సాప్ డిపిగా పెట్టుకున్నాడు. సైబర్ మోసగాళ్లు ఆచిత్రాన్ని స్క్రీన్‌షాట్ తీసుకని అందులో భార్య చిత్రాన్ని మరో వ్యక్తితో ఉన్నట్లు మార్ఫింగ్ చేసి భర్తకు పంపించారు. ఈచిత్రాలు వైరల్ కాకుండా ఉండాలంటే డబ్బులు పంపించాలని డిమాండ్ చేశారు. కుటుంబ పరువు పోతుందని భయపడిన బాధితులు రూ.1.50లక్షలు ఆమోసగాళ్లకు బదిలీ చేశారు. అంతటితో ఆగకుండా మరిన్ని డబ్బులు డిమాండ్ చేయడం మొదలుపెట్టారు. అలాగే మరో వివాహితుడి వాట్సాప్‌కి కాల్ గర్ల్స్ కావాలా..? అనే పేరుతో లింక్ వచ్చింది. దానిపై క్లిక్ చేయగానే అతడి ఫోన్‌నంబర్ ఓవాట్సాప్ గ్రూప్‌తో అనుసంధానం అయ్యింది. కొద్దిక్షణాల్లోనే నగ్నంగా, అర్ధనగ్నంగా ఉన్న అమ్మాయిల చిత్రాలు వచ్చాయి. ఏ అమ్మాయి కావాలో ఎంపిక చేసుకోండని సందేశం వచ్చింది. వివాహితుడు తనకు అలాంటి ఆలోచన లేదని సమాధానం ఇచ్చాడు. అంతే.. ఏదో ఒక అమ్మాయిని ఎంపిక చేసుకోవాల్సిందే.. లేదంటే నీ అంతు తేలుస్తాం.. బతుకు బజారుకీడుస్తాం అంటూ అవతలి వ్యక్తులు బెదిరించడం మొదలుపెట్టారు. వివాహితుడు తన భార్యతో దిగిన చిత్రాన్ని వాట్సాప్ డిపిగా పెట్టుకోగా.. ఆ చిత్రాన్ని మార్ఫింగ్ చేసి పంపించారు. డబ్బులు ఇవ్వకుంటే ఆఫోటోలు వైరల్ చేస్తామని బెదించారు. దీంతో ఆవ్యక్తి పోలీసులు ఆశ్రయించాడు. ఇలా హైదరాబాద్ సైబర్‌క్రైం పోలీస్ స్టేషన్‌లో నిత్యం ఇలాంటి కేసులే నమోదవుతున్నాయి. గతంలో ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ట్విట్టర్ వంటి మాధ్యమాల్లో ఫ్రెండ్ రిక్వేస్ట్ పెట్టేవారు. స్నేహం పేరిట దగ్గరై, ఆయా సామాజిక మాధ్యమాల్లో ఇతరులు పెట్టే పోస్టులు, డిపిల్లోని చిత్రాలను తీసుకుని..మోసగాళ్లు వారి ఖాతాలకు డిపిగా పెట్టుకునేవారు. ఎవరి చిత్రాలైతే తీసుకుని డిపిగా పెట్టుకున్నారో వారి స్నేహితులు, బంధువులకు చికిత్సకోసం డబ్బులు కావలని సందేశాలు పంపేవారు. ఇలా డబ్బులు దండుకున్న కేసులు ఎన్నోనమోదయ్యాయి. ఇప్పుడు కొత్తగా వాట్సాప్ డిపిలు తీసుకుని, వాటిని మార్ఫింగ్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని సైబర్ క్రైం పోలీసులు తెలుపుతున్నారు.




**స్పందిస్తే అంతే..** అపరిచిత వ్యక్తుల నుంచి కాల్ గర్ల్స్ ప్రొవైడ్ ఇతరత్రా పేర్లతో ఫోన్‌కు ఏవైనా లింకులు వస్తే,. వాటిపై క్లిక్ చేయకుండా వెంటనే డిలీట్ చేయాలి. ఒకవేళ ఆలింక్‌లపై క్లిక్ చేస్తే ..అవతలి వ్యక్తుల నుంచి బెదిరింపు తరహా సందేశాలు, ఫోన్ కాల్స్ వచ్చినా స్పందించకుండా ఉంటే మంచింది. ఆఫోన్‌నెంబర్లను బ్లాక్ చేసేయాలి. ఎప్పుడైతే మీరు స్పందించడం మానేస్తారో.. లేదా ఫోన్ నెంబర్ బ్లాక్ చేస్తారో ఆమోసగాళ్లు మరో ప్రయత్నంలోకి వెళ్ళిపోతారు. స్పందిస్తే భయపడినట్లు గ్రహించి డబ్బులు డిమాండ్ చేయడం మొదలుపెడతారు తస్మాత్ జాగ్రత్త అంటున్నారు సైబర్ క్రైం పోలీసులు.

# నగర శివారులో విదేశీ మద్యం పట్టివేత

సరూర్‌నగర్, ఎల్‌బినగర్, మే 16 ప్రభాతవార్త: హైదరాబాద్ నగర శివార్లలో అక్రమ విదేశీ మద్యాన్ని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన సరూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధి కిందకు వచ్చే అల్మాస్‌గూడలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. అల్మాస్‌గూడలోని ఎపిఆర్ఆర్ గార్డెన్స్‌లో సోమవారం రాత్రి విదేశీ మద్యాన్ని (పన్ను చెల్లించని మద్యం) సరఫరా చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు రంగారెడ్డి జోన్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య ఆదేశాల మేరకు అసిస్టెంట్ సూపరింటెండెంట్ జీవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం సరఫరా చేస్తున్న ఆదిభట్లకు చెందిన సంరెడ్డి రవికాంత్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని 9 జానీవాకర్ రెడ్ లేబుల్ 750 ఎంఎల్ బాటిళ్ళు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అధికారులు జరిపిన విచారణలో అక్రమ మద్యం సరఫరాదారులైన ఆదిభట్లకు చెందిన శ్రీవీర్‌గౌడ్ నుండి 12 రాయల్ ఛాలెంజ్ బాటిళ్లు, అల్మాస్‌గూడకు చెందిన గుగులోత్ వెంకన్న నుండి 54 సిగ్నేచర్ బాటిళ్లు, సాయికిరణ్ కుమార్ నుండి 36 బ్లెండర్ స్ప్రైడ్ బాటిళ్లు, 48 రాయల్ ఛాలెంజ్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో విదేశీ, లోకల్ కలిపి మొత్తం 159 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకొన్నారు. అయితే పట్టు బడిన నిందితులను సరూర్ నగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగిస్తామని మరో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. కాగా దాడుల్లో ఇన్స్‌పెక్టర్లు శ్రీధర్, శ్రీనివాస్, కల్పన, ఎస్ఐ కుర్మనాయకులు, సిబ్బంది లోకేశ్వర్‌రెడ్డి, నర్సింగ్‌రావు, ఫరీద్, రవి, సుధాకర్, శ్రీశైలం, శ్రీనివాస్, సుధాకర్‌లు పాల్గొన్నారు.



ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడుల్లో స్వాధీనం చేసుకున్న విదేశీ, లోకల్ మద్యం బాటిళ్లు, పట్టుబడిన నిందితులు (కూర్చున్న వారు)

# బ్లాక్ ఫిల్మ్, సైరన్లపై ట్రాఫిక్ పోలీసుల కొరడా

హైదరాబాద్, మే 16 ప్రభాతవార్త : ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. నల్ల ఫిల్మ్‌లు పెట్టుకోవడం, ఫిల్మ్ మల్టీటోన్డ్ హారన్లు, సైరన్‌లు కలిగిన వాహనాలపై చర్యలు తీసుకుంటున్నారు. టింటెడ్ గ్లాస్ లేదా బ్లాక్ ఫిల్మ్, సైరన్‌లు, మల్టీ టోన్ హారన్‌లు అమర్చిన వాహనాలపై సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఎనిమిది రోజుల్లో 1050 కేసులు నమోదు చేశారు. సుప్రీంకోర్టు, సెంట్రల్ మోటార్ వెహికల్ చట్టం ప్రకారం వాహనాలను డ్రైవ్ చేసే వ్యక్తులకు రెండు వైపులా, వెనుక వైపులా నుంచి వచ్చే వాహనాలు కనిపించాలి. అయితే బ్లాక్ ఫిల్మ్‌లు ఏర్పాటు చేయడం వల్ల ఇతర వాహనాలు కనిపించకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో బ్లాక్ ఫిల్మ్‌లు రోడ్డు రవాణా అథారిటీ పూర్తిగా నిషేధించింది. అయితే ఈ నిబంధనలను ఉల్లంఘిస్తున్నవారిపై ట్రాఫిక్ పోలీసులు రూ.1000 చలాన్‌గా విధిస్తున్నారు. దీంతో పాటు అద్దాల నుంచి ఫిల్మ్‌ను తీసివేస్తున్నారు. బ్లాక్ ఫిల్మ్ అద్దాల వల్ల పక్క, వెనుక వైపు కనిపించదు. ఇది ప్రమాదాలకు దారి తీస్తుందని జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) కె.నారాయణ్ నాయక్ తెలిపారు. కొంత మంది కార్ల యజమానులు సన్‌షేడ్‌లు, కర్టెన్‌లను కూడా ఉపయోగిస్తున్నారు అని చెప్పారు. అయితే వీటి వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. బ్లాక్ ఫిల్మ్ అద్దాలపై ప్రజల్లో అవగాహన కొరవడిందని, కార్ డెకర్‌లు, యాక్సెసరీ షాపుల యజమానులు ఆర్‌టిఎ ఆమోదం అని కార్ల యజమానులకు చెప్పి అక్రమంగా బ్లాక్ ఫిల్మ్‌లను బిగిస్తున్నారని వెల్లడించారు. ఇది చట్టవిరుద్ధమన్నారు.

మరో వైపు సైబరాబాద్ పరిధిలో అనధికార సైరన్‌ల వినియోగంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈమేరకు సైబరా బాద్ పరిధిలో అనధికార సైరన్‌లు వాడే అన్ని వాహనాలను అదుపులోకి తీసుకోవాలని సిపి స్టీఫెన్ రవీంద్ర పోలీసులను ఆదేశించారు. దీంతో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేశారు.

### అంగరంగ వైభవంగా కళాసాగరం

# వార్షిక యువ నృత్యోత్సవాలు



బహుమతులు పొందిన కళాకారులతో పూనమ్, ఆర్.నారాయణ

నాంపల్లి, మే 16 ప్రభాతవార్త : ప్రముఖ సాంస్కృతిక సంస్థ కళాసాగరం వార్షిక యువ నృత్యోత్సవాలు 3 రోజులపాటు అంగరంగ వైభవంగా జరిగాయి. మొదటిరోజు కె.వి.అనన్య భరతనాట్యం, నిత్య కూచిపూడి నృత్యం; రెండవరోజు ఆర్.వి.సాయి సుదీప్తి కూచిపూడి, మైత్రి ప్రసాద్ భరతనాట్యం; చివరిరోజు జెఎన్‌వి ఆర్ట్స్ నిర్వహణలో 'ఫ్రీ టు ఫ్లై' శీర్షికన ముందుగా గణేష ప్రార్థన, పంజాబీ నృత్యం, దాండియా, దేశభక్తి, జానపద నృత్యాలను వివిధ అంశాలతో యువ నర్తకీమణులు అద్భుత శృతి లయబద్ధ, హావభావాలు, ఆంగిక ప్రదర్శనలతో తమతమ ప్రతిభా పాటవాలను, నాట్యకౌశలంతో రక్తికట్టించి నృత్యసౌరభాలను వెదజల్లుతూ విచ్చేసిన అశేష నృత్యప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. చివరిగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన పూనమ్ తదితర ప్రముఖులు సంస్థ ప్రధాన కార్యదర్శి ఆర్.నారాయణలు 3రోజులపాటు కళాసాగరం వార్షిక యువ నృత్యోత్సవాల్లో పాల్గొన్న చిన్నారి, యువ కళాకారిణులను ఘనంగా సత్కరించి ప్రతిష్టాత్మక బహుమానాలను, మెమెంటోలను, ట్రోఫీలను, సర్టిఫికెట్లను ప్రదానంచేసి ఎంతగానో అభినందించి శుభాశీస్సులందజేశారు.

# శరణ్‌సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలి



వై జంక్షన్‌లో శరణ్‌సింగ్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న మహిళలు

సైఫాబాద్, మే 16 ప్రభాతవార్త: మహిళా రెజ్లర్లపై లైంగిక వేదింపులకు పాల్పడ్డ బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్‌శరణ్‌సింగ్‌ను తక్షణమే అరెస్టు చేసి పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అనేక మంది మహిళలు మంగళవారం హిమాయత్‌నగర్‌లోని వై జంక్షన్ వద్ద సింగ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. దిష్టిబొమ్మ దగ్ధం సందర్భంగా పోలీసులకు మహిళలకు వాగ్వివాదం జరిగింది. దిష్టిబొమ్మను పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. దీంతో మహిళలు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేయడంతో పోలీసులు ఎట్టకేలకు దిష్టిబొమ్మను తిరిగి మహిళలకు అప్పగించారు. అనంతరం వారు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా భారత జాతీయ మహిళా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షురాలు డా.రజనీ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి పాలనలో అమ్మాయిలకు, మహిళలకు రక్షణ కరువైందని ఆరోపించారు. ఒలంపిక్, కామన్వెల్త్ గేమ్స్‌లో పతకాలను సాధించిన రెజ్లర్లు న్యాయం కోసం గత నెల రోజులుగా ఢిల్లీ విధుల్లో ధర్నా నిర్వహించడం అవమానకరమైన విషయమన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వత్తిడి వల్లనే ఢిల్లీ పోలీసులు సింగ్‌ను అరెస్టు చేయలేదని ఆరోపించారు. తక్షణమే సింగ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉస్తెల సృజన, జ్యోతి, నాయకురాళ్ళు ప్రేమ్‌పావని, కళావతి, ఎస్.ఛాయాదేవి పాల్గొన్నారు.

**సింగ్‌ను అరెస్టు చేయాలని సంతకాల సేకరణ..** అంతకు ముందు బిజెపి ఎంపి బ్రిజ్ భూషన్‌శరణ్‌సింగ్‌ను అరెస్టు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ భారత జాతీయ మహిళా సమాఖ్య హైదరాబాద్ జిల్లా సమితి హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ భవన్ ఎదుట సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టింది. సమాఖ్య సిటీ యర్ నాయకురాలు పి.ప్రేమ్‌పావని మాట్లాడుతూ సింగ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని, రెజ్లర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# కవిత్వం సమాజానికి ప్రయోజనకారి కావాలి

**బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్.కృష్ణయ్య**



కవిసమ్మేళనంలో భాగంగా పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య, అమ్మంగి వేణుగోపాల్, శంకరం తదితరులు

హైదరాబాద్, మే 16,ప్రభావార్త: కవిత్వం సమాజానికి ప్రయోజనకారి కావాలని బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్.కృష్ణయ్య అన్నారు. తెలంగాణ కవుల సంఘం, బిసి టీచర్స్ యూనియన్ కళాసూర్య సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని బిసిభవన్‌లో సుతారపు వెంకటనారాయణ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి కవిసమ్మేళనం నిర్వహించారు. దీనికి కృష్ణయ్య ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతూ కవిత్వం మారుతున్న కాలనుగుణంగా పరిణామ క్రమంలో ఉండాలన్నారు. కవులు కవిత్వంలో ప్రాచీన భారతీయ సంస్కృతుల సంప్రదాయ అవగాహన చేసుకుంటూ ప్రపంచీకరణ ప్రభావాలు ఆధునిక సమాజంపై ఎలా ప్రభావితం చూపుతున్నాయనే విషయాన్ని వివరించాలన్నారు. అవినీతి రహిత సమాజాన్ని దోపిడీ పీడన, కుల వివక్షత తొలిగినప్పుడే మనం పొందిన స్వాతంత్ర్యానికి విలువ అన్నారు. ఈకార్యక్రమంలో కాళోజీ అవార్డు గ్రహీత అమ్మంగి వేణుగోపాల్, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు నాళేశ్వరం శంకరం, అనుముల ప్రభాకరచారి, దొంతర బోయిన దైవాదీనం పాల్గొన్నారు.

## అత్యాధునిక హంగులతో ఆత్మగౌరవ భవనాల నిర్మాణం : మంత్రి గంగుల కమలాకర్




కోకాపేటలోని మున్నూరుకాపు భవన నిర్మాణంకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

నార్సింగి, మే 16 ప్రభాతవార్త : సీఎం కేసీఆర్ ఆదేశాలతో, కోకాపేట్‌లో నిర్మిస్తున్న ఆత్మగౌరవ భవనాలన్నింటిని అత్యాధునిక హంగులతో పూర్తిచేసి ప్రజలకు త్వరలోనే అందజేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. మంగళవారం ఎంపి వద్దిరాజు రవిచంద్ర, బీసీ సంఘాల నాయకులు విజయ్‌బాబు, గోపాల గణేష్, పొన్న రమేష్‌లతో కలిసి గండిపేట మండలం కోకాపేట్‌లో మున్నూరుకాపులకు కేటాయించిన స్థలాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ వేల కోట్ల రూపాయల విలువ చేసే స్థలాల్లో ఆత్మగౌరవ భవనాలు నిర్మింపజేస్తున్నారన్నారు. ఇప్పటికే కొన్ని భవనాలు పూర్తయ్యాయని, మిగితావి సైతం త్వరలోనే పూర్తి చేసేందుకు ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయన్నారు. 87.3ఎకరాలలో రూ.95.25కోట్లతో 41.కుల సంఘాలకు చెందిన ఆత్మగౌరవ భవనాలు నిర్మిస్తున్నామని, ఇందులో యాదవ, కురుమ భవనాలు పూర్తయ్యాయని వివరించారు. మున్నూరుకాపు, ముదిరాజ్, గౌడ, బసవేశ్వర భవనాలు వేగంగా నిర్మితమవుతున్నాయన్నారు. మున్నూరుకాపు ఆత్మగౌరవ భవనం డిజైన్లను మంత్రి ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కొండ దేవయ్య, నాయకులు చల్లా హరిశంకర్, బీసీ సంక్షేమ శాఖ జేడీ చంద్రశేఖర్, డిడిలు సంధ్య, విమలాదేవిలు వాటర్ వర్క్స్ డిఇ నరహరి, ఎలక్ట్రిసిటీ ఎస్ఇ వెంకన్న, హెచ్ఎండిఏ అధికారి ప్రవీణ్, పలువురు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మొబైల్ వినియోగదారుల రక్షణ, భద్రత కోసం సంచార్ సాథీ పోర్టల్

**టెలికం ప్రత్యేక డిజీ అశోక్‌కుమార్**




బేగంపేట మే 16, ప్రభాతవార్త : మొబైల్ ఫోన్ వినియోగదారుల రక్షణ, భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం సంచార్ సాథీ పేరుతో నూతన పోర్టల్‌ను ఆవిష్కరించిందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని టెలికం ప్రత్యేక డీజీ అశోక్‌కుమార్ సూచించారు.మంగళవారం ఢిల్లీలో రైల్వే, టెలికాం, ఎలక్ట్రానిక్స్ ఐటీ శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ ఈ పోర్టల్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా సికింద్రాబాద్ సీటీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఈ పోర్టల్‌లోని రెండు మాడ్యుల్స్‌లోని టాఫ్కాఫ్(టీఏఎఫ్‌సి ఓపీ) ద్వారా వినియోగదారుడి ఆధార్ కార్డుమీద ఎన్ని సిమ్ కార్డులు వాడుతూ దుర్వినియోగం చేస్తుంటే గుర్తించవచ్చని తెలిపారు. అదే పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేసి మనకు కాని సిమ్‌లను బ్లాక్ చేయవచ్చని చెప్పారు. టాఫ్ కాప్‌ను ఏపీఎల్ఎస్ విజయవాడ బ్రాంచ్ తయారు చేయగా ఏడాదిన్నరగా ఉపయోగిస్తున్నామని,ఇప్పుడు జాతీయ స్థాయికి దీన్ని అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. అలాగే సీఈఐఆర్ ద్వారా మొబైల్ ఫోన్ దొంగిలించబడినా పొగొట్టుకున్నా ఐఎంఈఐ నంబర్లను పోర్టల్‌లో సమర్పించవచ్చని తెలిపారు. తద్వారా ఫోన్ బ్లాక్ చేయడంతో పాటు సమాచారం పోలీసులకు చేరుతుందని చెప్పారు. ఎవరైనా దొంగిలించబడిన ఫోన్లో సిమ్ కార్డు వేసి వాడేందుకు యత్నిస్తే ఆ సిమ్ కార్డు నెంబర్ ఎక్కడ ఉందో పూర్తి సమాచారం పోలీసులకు చేరుతుందని చెప్పారు. అందువల్ల దొంగిలిచబడిన ఫోన్‌ను ట్రేస్ చేయవచ్చని చెప్పారు. అలాగే నకిలీ ఐఎంఈఐ నంబర్లను వాడకుండా నిరోదిస్తుందని తెలిపారు. ఏఎస్‌టిఆర్ ద్వారా పేషియల్ రికగ్నైజేషన్, డేటా అనలిటిక్స్‌ను వివిధ పద్దతులతో గుర్తిస్తుందని ఒక ఫోటో గ్రాఫ్‌ను ఉపయోగించి ఎన్ని కనెక్షన్లు తీసుకున్నారో తెల్సుకోవచ్చని తెలిపారు.ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా 40.87లక్షల అనుమానాస్పద కనెక్షన్లను గుర్తించి అందులో 36.61కనెక్షన్లను రద్దు చేసినట్లు చెప్పారు.ఈ పోర్టల్ ద్వారా మొబైల్ వినియోగదారులు సైబర్ క్రైం, బ్యాంకింగ్ మోసాలు తదితర వాటిని నిరోధించేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో డీడీజీ (కంప్లైంట్స్)గౌరీశంకర్, డీడీజీ (సెక్యూరిటీ) రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ అక్రమ నిర్మాణం కనిపించడం లేదా?

**అనుమతి లేని చిత్రపురి కాలనీ అసోసియేషన్ భవనం ❒ పట్టించుకోని హెచ్ఎండిఏ, మున్సిపల్ అధికారులు**

నార్సింగి, మే 16 ప్రభాతవార్త : అధికార పార్టీలోని బడా నేతల అండదండలు, అధికారుల శీతకన్ను వెరసి మణికొండ చిత్రపురి కాలనీలో అక్రమాలు అనేకం వెలుగు చూస్తున్నాయి. హెచ్ఎండిఏ నుంచి పొందిన అనుమతి ఒకటుంటే స్థానిక నాయకులు వాటికి భిన్నంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు కాలనీ వాసులు పేర్కొంటున్నారు. అధికారులు పూర్తిగా కాలనీ అసోసియేషన్ కనుసన్నుల్లోనే పని చేస్తున్నారని, ఏది కూల్చాలంటే అది కూలుస్తూ కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ కాలనీలో యధేచ్చగా నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు కిమ్మనకుండా ఉండడం వెనుకాల ఆంతర్యం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల అధికారులు భారీ పోలీసు బందోబస్తుతో వచ్చి చిత్రపురి కాలనీలో అక్రమ నిర్మాణాలంటూ కొన్నింటికి కన్నాలు వేసి వెళ్లారని, అక్రమ నిర్మాణాలైనా కలర్ వేసుకున్నారని కొన్నింటిని వదిలేసి వెళ్లడం జరిగిందని స్థానికులు వివరించారు. అంతెందుకు ఈ కాలనీలో ఉన్న ఆఫీసు భవనం వాటర్ ట్యాంకుపైన కట్టారని, దీనికి ఎలాంటి అనుమతి తీసుకోలేదని, ఈ భారీ కట్టడం అధికారులకు కనిపించలేదా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అసలు వాటర్ ట్యాంక్‌పై భవనం నిర్మిస్తుంటే సంబంధిత అధికారులు కిమ్మనకుండా ఉండడం ఏమిటని? అక్రమాలంటూ మళ్లీ మళ్లీ ఇక్కడికి వస్తున్న హెచ్ఎండిఏ, మున్సిపల్ అధికారులు దీని జోలికి వెళ్లకపోవడంలో ఆంతర్యమేమిటో వారికే తెలియాలని స్థానికులు పేర్కొంటున్నారు. పైసా పైసా కూడబెట్టుకొని నిర్మించుకున్న మా ఇళ్లను ఎవరినో మెప్పించేందుకు కూల్చివేశారని, అధికారులకు నిజాయితీ ఉంటే కాలనీ కార్యాలయ భవనంను కూల్చివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కూల్చివేతల సమయంలో అధికారులతో వాగ్వాదం చేసిన 50.మందికి కరెంటు, నీటి సరఫరాలను నిలిపి వేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ కాలనీ సినీ కార్మికులదని, దీనిలో ఇప్పుడు సినీ కార్మికులకంటే బయటి వారే ఎక్కువగా ఉంటున్నారని, వారి ఇళ్లే అధికంగా ఉన్నాయని కార్మికులు వాపోతున్నారు. అసోసియేషన్ పెద్దలు మాపై పెత్తనం చెలాయిస్తూ, ఈ కాలనీలో వందల కోట్ల రూపాయల అక్రమాలకు పాల్పడుతున్నారని, ఈ కాలనీలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి అవినీతికి అడ్డుకట్ట వేయాలని చిత్రపురి కాలనీ సినీ కార్మికులు కోరుతున్నారు. ఈ విషయంపై కాలనీ అధ్యక్షులు అనిల్ వల్లభనేనిని వివరణ అడిగితే తాత్కాలిక కార్యాలయంగా దీన్ని నిర్మించామని, కొత్త భవనంను నిర్మించుకున్న తరువాత దీన్ని కూల్చివేస్తామని తెలిపారు.




మణికొండ చిత్రపురి కాలనీలో అనుమతి లేకుండా వెలిసిన కాలనీ అసోసియేషన్ కార్యాలయం భవనం

**హెచ్ఎండిఏ అధికారిణి వివరణ..** మణికొండ చిత్రపురి కాలనీలోని కార్యాలయ భవనం నిర్మాణంపై హెచ్ఎండిఏ అధికారి కౌసల్యను వివరణ అడిగితే ఇది అక్రమ నిర్మాణమేనని తెలిపారు. వాటర్ ట్యాంక్‌పై భవనం నిర్మించడం జరిగిం దని, దీనికి హెచ్ఎండిఏ గాని, మున్సిపల్ గాని ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. త్వరలోనే ఈ భవనంపై చట్టపరిధిలో చర్యలు తీసుకుంటామని కౌసల్య స్పష్టం చేశారు. అలాగే మణికొండ మున్సిపల్ కమీషనర్ ఫల్గుణ్ కుమార్ ఈ విషయంపై స్పందిస్తూ చిత్రపురి కాలనీ కార్యాలయ భవనంకు ఎలాంటి అనుమతి లేదని, దీన్ని కూల్చాలని హెచ్ఎండిఏ అధికారులను కోరుతామని, త్వరలోనే చర్యలుంటాయని స్పష్టం చేశారు.

# సిరాజ్ ఇంట్లో సందడి చేసిన ఆర్‌సిబి జట్టు



హైదరాబాద్, మే 16,ప్రభాతవార్త: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఆటగాళ్ల హైదరాబాద్‌లో సందడి చేశారు. సోమవారం రాత్రి ఆటీమ్ స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ ఇంటికి వచ్చారు. సిరాజ్ ఇటీవలే ఫిలింనగర్‌లో కొత్తఇంటిని నిర్మించగా విరాట్‌తోపాటు అనుష్కశర్మ, డుప్లెసిస్‌తోపాటు సహచర ఆటగాళ్లను ఆహ్వానించాడు. దీంతో సిరాజ్ ఇంటికి వచ్చిన ఆటగాళ్ల హైదరాబాదీ ప్రత్యేక వంటకాలను ఆరగించారు. కాగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2023 సీజన్ 16లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో కీలక పోరుకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు సిద్ధమైంది. ఈమెగా ఈవెంట్‌లో భాగంగా ఉప్పల్ వేదికగా మే 18న సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్‌తో బెంగళూరు జట్టు తలపడనుంది. ఇప్పటికే ఆర్సీబి ప్లేయర్లు హైదరాబాద్ చేరుకున్నారు.

## బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయి : గజ్జెల నాగేశ్



బల్కంపేట్ ఎల్లమ్మ దేవాలయంలో పూజలు చేసిన బిఆర్ఎస్ గజ్జెల నాగేశ్, రంగ రవిందర్ గుప్త తదితరులు

కంటోన్మెంట్, మే 16 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన తెలంగాణ రాష్ట్ర బేవరేజెస్ కార్పోరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్, తెలంగాణ ఉద్యమ నేత రంగ రవిందర్ గుప్తలు మంగళవారం బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శిం చుకున్నారు. ఈ సందర్భంగా గజ్జెల నాగేశ్ మాట్లాడుతూ తెలం గాణలో ప్రసిద్ధి గాంచిన బల్కంపేట ఎల్లమ్మకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. అమ్మవారిని దర్శించుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయన్నారు.

## జీహెచ్ఎంసీ చెత్త వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



బేగంపేట మే 16, ప్రభాతవార్త : జీహెచ్ఎంసీ చెత్త తరలించే వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడి కక్కడే ప్రాణాలు కోల్పోయిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారు ఝామున చోటు చేసుకుంది. ఈ సంఘటనపై పెట్రో కారు 3లో రాత్రి విధులు నిర్వహిస్తున్న ఈ.సునీల్‌కుమార్ ఫిర్యాదు మేరకు బేగంపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెట్రోకారు 3లో కానిస్టేబుల్ ఈ.సునీల్‌కుమార్ ఎస్పివో కిరణ్‌కుమార్ రెడ్డితో కల్సి పరేడ్ గ్రౌండ్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం తెల్లవారు ఝామున వారికి డయల్ 100నుంచి సమాచారం వచ్చింది. ఎస్బిఐ జంక్షన్‌లో యాక్సిడెంట్ జరిగిందని సమాచారం అందింది. దీంతో వారు వెంటనే అక్కడకు వెళ్లారు. జీహెచ్ఎంసీకి చెందిన ఏపీ 11ఎక్స్ 7219 వాహనం ఓ వ్యక్తిని ఢీకొట్టింది. దీంతో ఆ వ్యక్తి అక్కడి కక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారు (30)సంవత్సరాలు ఉంటుంది. వాహనం ఢీకొట్టిన వ్యక్తి ఒంటిపై చొక్కాలేదని, బ్లూకలర్ ఫ్యాంటు ధరించి ఉన్నాడన్నారు. అతన్ని గురించి సమీపంలో విచారించగా ఎవరూ గుర్తించలేదన్నారు. అతను బిచ్చగాడు అయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై లారీ డ్రైవర్‌పై నిర్లక్ష్యం, ర్యాష్ డ్రైవింగ్ సెక్షన్లపై కేసు నమోదు చేసామని, మృతుని ఆచూకి తెలిసినవారు బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై బి.శ్రీనివాసులు తెలియజేసారు.

## డెంగీపై ప్రచార ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న మహాలక్ష్మీరామన్‌గౌడ్

సైఫాబాద్, మే 16 ప్రభాతవార్త: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే డెంగీ జ్వరం, ఇతర విష జ్వరాలు రాకుండా జీవించవచ్చునని హిమాయత్‌నగర్ డివిజన్ కార్పోరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ సూచించారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఎంటమాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్ డివిజన్‌లో జరిగిన అవగాహన ర్యాలీలో ఆమె మాట్లాడారు. డెంగీ జ్వరం రాకుండా ముందుగా జాగ్రత్త చర్యలు తీసుకుంటే ప్రమాదాలను నివారించవచ్చునని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రామన్‌గౌడ్, మల్లేష్, జైస్వాల్, ప్రవీణ్, బిందియా, జాకీ, సత్యనారాయణ, లాల్, పద్మజా, హితేష్ తదితరులు పాల్గొన్నారు.

## గాజులరామారంలో కొనసాగుతున్న కూల్చివేతలు

జీడిమెట్ల, మే 16 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ మండలం గాజురామారం డివిజన్‌లోని దేవేందర్‌నగర్ ప్రభుత్వ భూమిలో వెలసిన అక్ర మ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కొరఢా ఝుళిపించారు. మేడ్చల్ జిల్లా ఆర్‌డీఓ పర్యవేక్షణలో భారీ పోలీసు బందోబస్తుతో తెల్ల వారు జామున 6గంటలకు రెవెన్యూ సిబ్బంది జేసీబీలతో కూల్చివేతలు చేపట్టారు. కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టినా ప్రభుత్వ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోడంపై పలు విమర్శలు వస్తున్న నేథ్యంలో రెవెన్యూ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య ఉదయం నుంచే కూల్చివేతలు ప్రారంభించారు. సర్వే నెంబర్ 342, 329, 307లలో సుమారు 350ఇళ్ళను జేసీబీతో నేలమట్టం చేశారు. ప్రభుత్వ స్థలాల్లో వెలసిన అక్రమ నిర్మాణాలు కూల్చివేయడంతో కూలీ పనులు చేసుకుంటూ పైసా పైసా కూడబెటి కొందరు ప్లాట్లు కొనగా, మరికొందరు బంగారం అమ్మి ప్లాట్లు కొన్న నిరుపేదలు రోడ్డున పడ్డారు. తమ ఇళ్ళను కూల్చివేయ వద్దంటూ రెవెన్యూ అధికారులను, పోలీసులను మహిళలు వేడుకున్నారు. ఈ కూల్చివేతల్లో ఆర్‌డీ ఓ మల్లయ్య, కుత్బుల్లాపూర్ తహాశిల్దార్ సంజీవరావు పాల్గొన్నారు.

**ప్రభుత్వ భూములను కొనుగోలు చేసి మోసపోవద్దు: ఆర్‌డీఓ**

కబ్జాదారులు ప్రభుత్వ భూములను ఆక్రమించి వాటిలో నిర్మాణాలు చేపట్టి అమాయక ప్రజలకు లక్షల్లో వసూలు చేసి మోసం చేస్తున్నారని అలాంటి నిర్మాణాలను ప్రజలు కొనుగోలు చేయవద్దని తెలిపారు. విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించికున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అదే విధంగా కబ్జాదారులపై ఎఫ్ఐఆర్‌తో పాటు పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

## రేషన్ షాపుల తనిఖీ



అడ్డగుట్టలోని రేషన్‌షాపులను తనిఖీ చేస్తున్న కార్పొరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ తదితరులు

అడ్డగుట్ట, మే 16 ప్రభాతవార్త: పేద ప్రజలకు రేషన్‌షాపుల ద్వారా సరఫరా చేస్తున్న సబ్సిడి బియ్యం, నిత్యవసర సరుకులను సరసమైన ధరలకు ఇవ్వాలని, తూకాల్లో మోసాలు చేయకూడదని అడ్డగుట్ట డివిజన్ కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ రేషన్ డీలర్లు సూచించారు. సోషల్ ఆడిట్‌లో భాగంగా అడ్డగుట్టలోని వివిధ రేషన్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు దారులకు ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడి బియ్యం, నిత్యవసర సరుకులు సకాలంలో అందజేశారు. డీలర్లు తూకాల్లో మోసాలకు పాల్పడితే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రేషన్ డీలర్లు తప్పని సరిగా సమయ పాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 9వ సివిల్ సప్లయ్ అధికారిని సరస్వతీ, గ్రంథా లయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, బిఆర్ఎస్ నాయకులు ఎండి ఇస్మయిల్, నర్సింగ్, వడ్లూరి నరేశ్,రాజు, దేవయ్య పాల్గొన్నారు.

## మానసిక ఆరోగ్యం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దేవిప్రసాదరావు

సైఫాబాద్, మే 16 ప్రభాతవార్త: మానసిక సమస్యల నివారణలో సకాలజిస్టుల పాత్ర ఎంతో కీలకమని, మానసిక ఆరోగ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం చాలా అవసరమని రాష్ట్ర మాజీ చైర్మన్ దేవిప్రసాదరావు చెప్పారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని, ఇందుకుగాను పాఠశాలల్లో సైకాలజిస్టుల నియమానికి కృషి చేస్తామని తెలిపారు. తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ మంగళవారం లక్డికాపూల్‌లో నిర్వహించిన అసోసియేషన్ 6వ వార్షికోత్సవ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుతం సమాజంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలు, హత్యలు, ఆత్మ హత్యలు చూస్తున్నామని వ్యక్తుల్లో విపరీతమైన దోరణులు పోగొట్టడానికి సైకాలజిస్టుల అవసరం ఎంతైనా ఉందన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ మాట్లాడుతూ తమ సంఘం సమాజ సేవే ఆదర్శంగా-యువత మార్పే ధేయంగా ఆరు వసంతాలు పూర్తి చేసుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ పూర్ణిమానాగరాజు, డాక్టర్ శిల్ప, వెంపటి రాజు, సుధాకర్ పాల్గొన్నారు.

## కొంపల్లి మున్సిపాల్టీ పరిధిలో సిఎం కప్ క్రీడా పోటీలు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్

కొంపల్లి, మే 16 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అపర్ణ పామ్ గ్రోవ్స్ సెప్టిక్ ట్యాంక్ నుంచి దూలపల్లి కల్వర్టు వరకు ఆర్‌సీసీ పైపులైన్ పనులను మంగళవారం మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సన్న శ్రీశైలంయాదవ్ మాట్లాడుతూ సుమారు రూ.2.88కోట్లతో చేపడుతున్న పైపులైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని, అదే విధంగా పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు.

**మరో కార్యక్రమంలో..** కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం నిర్వహించనున్న సీఎం కప్ క్రీడా పోటీలను చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ ముఖ్య అతి ధిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వార్డు స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి క్రీడలను, క్రీడాకారులను ప్రభుత్వ ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ పోటీల్లో 15 సంవత్సరాల వయస్సు నుంచి 36 సంవత్సరాల వయస్సు గల క్రీడాకారులు కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, వాలీబాల్ తదితర విభాగాల్లో పురుషులు, మహిళలు తలపడనున్నారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులను జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, జూనియర్ అసిస్టెంట్ రంజిత్ కుమార్, వైస్‌చైర్మన్ గంగయ్య నాయక్, కౌన్సిలర్లు సువర్ణ, రవీందర్, కిరణ్, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నార్‌నౌల్ అగర్వాల్ సమితి అభివృద్ధి కోసం కృషి



సమితి ఎన్నికల అధికారి అశోక్ కుమార్ సింఘాల్‌కు ఫంకజ్ కుమార్ నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

చార్మినార్, మే 16 ప్రభాతవార్త : నార్‌నౌల్ అగర్వాల్ సమితి అభివృద్ధి కోసం తన శాయ శక్తుల కృషి చేస్తానని అశోక్ ఫౌండేషన్ అధ్యక్షులు పంకజ్ కుమార్ అగర్వాల్ అన్నారు. వచ్చే నెల నాలుగువ తేదీన జరగనున్న నార్‌నౌల్ అగర్వాల్ సమితి (సికింద్రాబాద్-హైదరాబాద్) ఎన్నికల సందర్భంగా సమితి అధ్యక్ష పదవి కోసం ఫంకజ్ కుమార్ అగర్వాల్ మంగళవారం తన నామినేన్ పత్రాన్ని సమితి ఎన్నికల అధికారి అశోక్ కుమార్ సింఘాల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో తనను గెలిపిస్తే సమితి అభ్యున్నతి కోసం పాటు పడతానని తెలిపారు. సమితి ఎన్నికల సహాయ అధికారి రవీందర్ నార్‌నౌలీ,వ్యాపారులు తరుణ్ కుమార అగర్వాల్,అనూప్ కుమార్ అగర్వాల్‌తో పాటు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



అడ్డగుట్ట వెంకట్ నగర్‌లో ఆయుష్మాన్ హెల్త్ కార్డులను అందజేస్తున్న బిజెపి నేత హాంసరాజ్ తదితరులు

అడ్డగుట్ట, మే 16 ప్రభాతవార్త: పేద ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బిజెపి మహంకాలి జిల్లా ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జి.హంసరాజ్ తెలిపారు. మంగళవారం అడ్డగుట్ట డివిజన్‌లోని వెంకట్ నగర్‌లో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ భారత్ యోజన పథకం కోసం ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హంసరాజ్ మాట్లాడుతూ ఇలాంటి పథకాలను రిజిస్ట్రేషన్ చేయించుకుంటే కేంద్ర ప్రభుత్వం ద్వారా 5 లక్షల ఆరోగ్య బీమా లభిస్తుందన్నారు. ఈ కార్డు తీసుకుంటే దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా వైద్య సదుపాయం ఉచితంగా పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వెంకట స్వామి, లక్ష్మణ్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కాలేజీ నిర్మాణపు పనులను ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి సబితారెడ్డి



తనిఖీ చేసి సూచనలు చేస్తున్న విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి

సరూర్‌నగర్, మే 16 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సిర్లాహిల్స్‌లో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీ పనులను మంగళవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మేయర్ ముదావత్ దుర్గదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లతో కలిసి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేసి కాలేజీ భవనాన్ని సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సిద్దాల లావణ్య బీరప్ప, గజ్జెల రాంచందర్, సిద్దాల పద్మ అంజ య్య, మాదరి సురేఖ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూ జ్వరం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి**

హైదరాబాద్, మే 16 ప్రభాతవార్త: ప్రాణాంతకమైన డెంగీ జ్వరం పట్ల ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని కోఠిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి సూచించారు. దోమలు కుట్టకుండా చూసుకుంటే పూర్తిగా డెంగీని నివారించుకోవచ్చునని ఇంటి పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు వంటివి ఉంచరాదని, తలుపులకు, కిటికిలకు దోమ తెరలు ఉపయోగించుకోవాలని ఆయన వివరించారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం సుల్తాన్‌బజార్‌లో అవగాహన ర్యాలీని నిర్వహించిన సందర్భంగా ఆయన ప్రసంగించారు. డెంగ్యూ జ్వరం యొక్క లక్షణాలు అధిక జ్వరం, దద్దుర్లు, తలనొప్పి, కండరాలు, కీళ్ళ నొప్పులు, రక్తస్రావంకు దారి తీస్తాయని, ఇది ప్రాణాంతకమవుతుందని ఆయన హెచ్చరించారు. అందువల్ల ముందుగా జాగ్రత్త చర్యలు చేపట్టడం వల్ల డెంగీ జ్వరం వ్యాప్తి చెందకుండా ఆరోగ్యవంతంగా జీవించవచ్చునని డాక్టర్ సూచించారు. ఎవరైన డెంగీ జ్వరంకు గురైతే వెంటనే ఆసుపత్రిలోని డాక్టర్ల వద్దకు వెళ్ళి చికిత్స పొందాలని ఆయన కోరారు. ఈ అవగాహన ర్యాలీలో సూపర్‌వైజర్‌నర్సు బాయ్, స్టాఫ్ నర్సు కీర్తిలత, ఎఎన్ఎంలు సుహాసిని, జయ, లక్ష్మి, ఇందిరా రాధ, పద్మ, సునీత, అశా వర్కర్లు మాధవి, అమరావతి, లావణ్య, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## సిద్దరామయ్యను కర్ణాటక సీఎంగా చేయాలి



ఓ.యూలో ర్యాలీ నిర్వహిస్తున్నన జెఎసి నాయకులు

తార్నాక, మే 16 ప్రభాతవార్త: కర్ణాటక ముఖ్యమంత్రిగా సిద్ద రామయ్యను కాంగ్రెస్ అదిష్టానం ప్రకటించాలని కోరుతూ మంగళవారం సాయంత్రం ఆల్ ఇండియా షపర్డ్స్ జేఏసీ చైర్మన్ కొంగల పాండు కురువ ఆధ్వర్యంలో ఓ.యూలో ర్యాలీ నిర్వహించారు. సిద్దరాయమయ్య వాల్‌పోస్టర్‌కు పులు చల్లుతూ పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా కొంగల పాండు కురువ మాట్లాడుతూ కార్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడానికి సిద్దరామయ్య కృషి ఎంతో ఉందన్నారు. ఆయన ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారని కొనియాడారు. సిద్దరామయ్యకు సీఎం ఇస్తేనే పాలన సక్రమంగా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పాలమూరు కురువ సంఘం అధ్యక్షులు మాదారం కృష్ణ, ఎర్ర సత్యం, రామకృష్ణ, మహేష్, కౌశిక్, శ్రీనివాస్ కురుమ, నరసింహ్మా కురుమ, నర్ర స్వామి, బెల్లి మహేష్‌కురుమ, జమ్ము నగేష్, పర్వతాలు, అనిల్‌కురుమ, వేణు, నగేష్, పర్వతాలు, మహేందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## పేదింటి ఆడపిల్లలకు పెద్దన్నగా కెసిఆర్: ఎమ్మెల్యే మాధవరం



గాయత్రి నగర్ చంద్రాగార్డెన్‌లో కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

యూసుఫ్‌గూడ, మే 16, ప్రభాతవార్త : ప్రతి పేదింటి ఆడపిల్లకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దన్నగా వారికి అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం గాయత్రినగర్‌లోని చంద్రాగార్డెన్‌లో 153మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను స్థానిక కార్పొరేటర్ సబీహాగౌసుద్దీన్‌తొ కలిసి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అందిస్తున్న కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకం బిజేపి కాంగ్రెస్ పాలిస్తున్న ఏ రాష్ట్రాలలోనైనా అందిస్తున్నారా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రాన్ని చూసి ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆదర్శంగా తీసుకుంటున్నారని అన్నారు. అదేవిధంగా అన్ని కులాల అన్ని మతాలకు వారి సాంప్రదాయాలకు తగ్గట్టుగా ప్రోత్సాహకాలను అందించిన ఏకైక నాయకుడు కేసీఆర్ అనీ కొనియాడారు. డివిజన్ పరిదిలో ఇప్పటికే కోట్లాది రూపాయలతో రోడ్లు, డ్రైనేజి, కమ్యూనిటీ హాల్, పార్కులు, నిర్మించడం జరిగిందని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని తాము అన్ని వేళల అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గం మైనార్టీసెల్ అధ్యక్షులు ఎమ్‌డి గౌసుద్దీన్, డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు లింగాల ఆయిలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, నాగుల సత్యం, రోనంకి జగన్, జాహేద్ షరీఫ్, సయ్యద్‌రియాజ్, యోగిరాజు స్వామి పాల్గొన్నారు.

## మహాధర్నాను విజయవంతం చేయండి



చార్మినార్ వద్ద జర్నలిస్టులు ప్ల కార్డుల ప్రదర్శన చేస్తున్న దృశ్యం

చార్మినార్,మే 16 ప్రభాతవార్త : జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18వ తేదీన వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరా పార్కు నిర్వహించ తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని టిడబ్ల్యుజేఎఫ్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ మంగళవారం హెచ్‌యుజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు చార్మినార్ వద్ద ప్ల కార్డులు ప్రదర్శించారు. న్యాయమైన జర్నలిస్టుల డిమాండ్ల సాధన కోసం ఫెడరేషన్ నిర్వహిస్తున్న మహాధర్నాకు పెద్ద ఎత్తున జర్నలిస్టులు తరలి వచ్చి విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ప్రతినిధులు పిల్లి రామచందర్,గుడిగ రఘు,విజయానందరావు,హెచ్‌యుజే నాయకులు రాజశేఖర్, సర్వేష్, రమేష్, వీరేష్,లక్ష్మణ్,సాదత్ అలీ,ప్రవీణ్ కుమార్,కాలేబ్, వెంకటస్వామి, హాంజరాజ్,శివతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ శతజయంతి సంవత్సరంలోనైనా ఆయనకు భారతరత్న ప్రకటించాలి

### ప్రముఖుల డిమాండ్



ఎన్టీఆర్ పురస్కారాలను ప్రదానం చేస్తున్న జస్టిస్ నాగమారుతి శర్మ, పిన్నమనేని సాయిబాబా, వంశీ రామరాజు తదితరులు


చిక్కడపల్లి, మే 16 ప్రభాతవార్త: భారత చలనచిత్రరంగంలో విభిన్న పౌరాణిక పాత్రలకు ప్రతిరూపంగా నిలిచిన ఏకైక నటులు, సంచలన రాజకీయ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు శతజయంతి సంవత్సరంలోనైనా ఆయనకు భారతరత్న ప్రకటించాలని ప్రముఖులు డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో ప్రముఖ సాంస్కృతిక సంస్థ కళానిలయం నిర్వహణలో ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు నిర్వాహకులు ఎ.సురేందర్, ఎ.పుష్పలత ఆధ్వర్యంలో జరిగాయి. ముఖ్యఅతిథులుగా సీబీఐ న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతిశర్మ, తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పిన్నమనేని సాయిబాబా, వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజులు పాల్గొని ఎన్టీఆర్ పురస్కారాలను నటుడు గుండు సుదర్శన్, భవానీశంకర్, కథానాయకుడు గ్రంథ రచయిత టి.నవీన్‌లకు బహుకరించారు. విఖ్యాత గాయని జిక్కి కుమార్తె హేమలతలకు 'ఘంటసాల ఎన్టీఆర్ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దోజు రవీంద్రాచారి, మేడిది సుబ్బయ్య ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.వి.రావు, టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పలుస బాల్‌రాజ్‌గౌడ్, టిడిపి రాష్ట్ర అధికారప్రతినిధి మ్యాడమ్ రామేశ్వరరావు, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, ఎస్ఆర్ఎస్ చారిటబుల్‌ట్రస్ట్ అధినేత ఎం.రామచంద్రరావు, సినీనిర్మాత డాక్టర్ సి.బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ నటించిన చిత్రాల నుంచి పాటలను గాయనీ గాయకులు రేవతి, బాపిరాజు అద్భుతంగా గానం చేశారు.

## మాతృవందనం పేరుతో గౌరవ పురస్కారాలు



హైదరాబాద్, మే 16 ప్రభాతవార్త: అమ్మే ఆది గురువు, దైవం అని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వీరసోమయ్య అన్నారు. అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజెస్ డైరెక్టర్ (హెచ్ఆర్) డాక్టర్ వై.జయప్రభ అధ్యక్షతన ఇంటర్నేషనల్ మదర్స్ డే కార్యక్రమంలో భాగంగా 'మాతృవందనం' కార్యక్రమం విద్యార్థులచే వారి తల్లుకు గౌరవ పురస్కారంగా జరిగింది. మాతృమూర్తులకు వారి పిల్లలకు గౌరవ పురస్కారంగా కార్యక్రమం నిర్వహించారు. మాతృమూర్తులకు వారి పిల్లలు కాళ్ళు కడిపి పూలు, పసుపు, కుంకుమ, గంధము సమర్పించి హారతులు నమస్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు కవితలు చదివి, పాటలు పాడారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వెంకటరావు మాట్లాడుతఊూ అమ్మ అంటే అమ్మవారని, అమ్మ అప్యాయతానురాగాలను మించినది ఏదీ లేదని అటువంటి తల్లిని సత్కరించుకొనే కార్యక్రమమే ఈ మాతృవందనం అని అన్నారు. పిల్లలుఈ అవకాశాన్ని వినియోగించుకుని తల్లిని గౌరవించి ఆమె ఆశీర్వాదం పొందడం ముఖ్యమన్నారు. సెకండ్ లాంగ్వేజెస్ హెచ్ఓడీ శిష్టామాధవి తదితరులు పాల్గొన్నారు.


## విశ్వప్రేమను వెదజల్లిన 'ప్రేమ పవనాలు-మానవతా సౌరభాలు'



నవలను ఆవిష్కరిస్తున్న వెంకటరెడ్డి, రాంబాబు, శ్రీదేవి, మల్లారెడ్డి

రవీంద్రభారతి, మే 16 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, జాతీయ సాహిత్య పరిషత్ భాగ్యనగరశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో రచయిత సి.ఎస్.రాంబాబు సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ రచయిత ఓయు తెలుగుశాఖ పూర్వాధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి విశిష్ట అతిథులు తెలంగాణ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి, ప్రమోద్, వేముల ప్రభాకర్, రచయిత-సీనియర్ పాత్రికేయుడు వేదాంతం సూరి తదితరులతో కలిసి ప్రముఖ రచయిత గులాబీల మల్లారెడ్డి రచించిన నవల ప్రేమ పవనాలు-మానవతా సౌరభాలు (క్యాంపస్‌లో సరిగమలు) ఆవిష్కరించి ఈ పుస్తకం విశ్వప్రేమను వెదజల్లుతుందని, వసుదైక కుటుంబాన్ని ప్రబోధించే భారతీయ సంస్కృతి ఔన్నత్యాన్ని చూపిన నవలని ఆయన ప్రశంసించారు. రాంబాబు అధ్యక్షోపన్యాసంలో 70, 80 దశాబ్దాల్లో కేంబ్రిడ్జ్ వంటి విశ్వవిద్యాలయంలో చదువుతున్న వివిధ దేశాల విద్యార్థుల మధ్య ఉన్న మానవతా విలువలను, ప్రేమభావనలను ఈ నవల అద్దంపడుతుందన్నారు. మంత్రి శ్రీదేవి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిని అంతర్జాతీయస్థాయిలో ప్రతిబింబించిందీ నవల అని వివరించారు. ముందుగా సభకు జాతీయ సాహిత్య పరిషత్ సంయోజకులు వడ్డూరి ఆంజేయులు స్వాగతం పలికారు. చివరిగా రచయిత మల్లారెడ్డిని ఘనంగా సత్కరించారు.

## ఎసిపిగా పదోన్నతి పొందిన బేగంపేట మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్



బేగంపేట మే 16,ప్రభాతవార్త : బేగంపేట మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న పాలడుగు శివశంకరరావు కు ఏసీపీగా పదోన్నతి లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 165 మంది ఇన్స్‌పెక్టర్లకు ఏసీపీలుగా పదోన్నతిని ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ జాబితాలో శివశంకరరావుకు ఏసీపీగా పదోన్నతి లభించింది. ఈయన 1996బ్యాచ్‌కు చెందిన వారు. మొదట ఇన్స్‌పెక్టర్ గా నిజామాబాద్ బిచ్కుంద్ సర్కిల్‌లో విధులు నిర్వర్తించారు. అనంతరం ఇంటెలిజెన్స్‌లో రెండు సంవత్సరాలు పనిచేసారు. ఆ తరువాత నగరంలోని సుల్తాన్ బజార్,సీసీఎస్ మల్కాజ్‌గిరి,చిక్కడపల్లి,సీసీఎస్‌లు విధులు నిర్వర్తించారు. అనంతరం బేగంపేట మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. బేగంపేట మహిళా పోలీస్‌స్టేషన్‌కు సొంత భవనం లేక పోవడంతో బేగంపేట పోలీస్ క్వార్టర్స్‌లో ఇటీవల కాలంలో శివశంకర్ ఓ క్వార్టర్‌ను తన మిత్రులు,దాతల సహకారంతో మహిళా పోలీస్‌స్టేషన్‌గా సుందరంగా తీర్చిదిద్దారు. ఈ భవనాన్ని నగర పోలీస్ కమీషనర్ సీ.వీ.ఆనంద్ చేతుల మీదుగా ప్రారంభించారు.

## నారాయణ మృతి బాధాకరం: మంత్రి తలసాని



బేగంపేట మే 16, ప్రభాతవార్త : తాడ్‌బండ్ హనుమాన్ ఆలయం ఫౌండర్ సభ్యులలో ఒకరైన చలువాది నారాయణ మృతి చాలా బాధాకరం అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. చలువాది నారాయణ మృతి వార్త తెల్సుకున్న మంత్రి తలసాని మంగళవారం రాంగోపాల్‌పేట డివిజన్ సోమసుందరం స్ట్రీట్ లోని వారింటికి వెళ్లి నారాయణ పార్థివ దేహం వద్ద పూల మాల ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేవునికి సేవ చేసే అదృష్టం కొందరికే దక్కుతుందని, అది నారాయణకు దక్కిందన్నారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట బీఆర్ఎస్ నాయకులు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ కొసికే కిరణ్మయి, కిషోర్ తదితరులు ఉన్నారు.

## ఇండ్ల క్రమబద్ధీకరణకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలి



ఇండ్ల క్రమబద్ధీకరణ కోసం వివరిస్తున్న తహసీల్దార్ శైలజ

సికింద్రాబాద్, మే 16 ప్రభాతవార్త : న్యూబోయిగూడలోని కీస్ బ్లాక్ సొసైటీ కమ్యూనిటీహాల్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇండ్ల క్రమబద్ధీకరణ జీఓ 58,59 గురించి సికింద్రాబాద్ తహసీల్దార్ శైలజ ఇక్కడి ప్రజలకు అవగాహన కల్పించారు. బీఆర్ఎస్ బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు ఎల్. వెంకటేషన్ రాజు ఆధ్వర్యంలో ఈ కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శైలజ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులందరు ఈనెల 30 తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, లంబుశ్రీను, కొత్తూరు వెంకటేష్, లక్ష్మి, ఆర్ఐ శ్రీనులతో పాటు బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం



కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న సభ్యులు

మూసాపేట, మే 16, ప్రభాతవార్త : 124 డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని జన్మభూమి కాలనీలో నివసించే యాదయ్య (68) అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మంగళవారం స్థానిక నాయకులను ఆదేశించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, డివిజి ట్రస్టు ద్వారా 5వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజ్యలక్ష్మి, మధులత, భిక్షపతి, సాయిగౌడ్, నాగేంద్రబాబు, మంజుల పాల్గొన్నారు.

## గొప్ప మనసున్న మహనీయుడు



బంజార నగర్‌లో కవితా విద్యానికేతన్ పాఠశాలల అధినేత ఏవి నర్సింగరావుకు నివాళులు అర్పిస్తున్న గుర్తింపు పొందిన పాఠశాలల అసోసియేషన్ సభ్యులు

యూసుఫ్‌గూడ, మే 16, ప్రభాతవార్త : ఎంతో మందికి విద్యను అందించి ఉన్నత శిఖరాలు అధిరోహించేలా కృషిచేసిన గొప్ప మనసున్న మహనీయుడు ఏ వి నర్సింగరావు అని ఆయన లేని లోటు తమ అసోసియేషన్‌కు కనిపిస్తుందని పలువురు గుర్తింపు పొందిన పాఠశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం బోరబండ బంజారనగర్‌లో కవితా విద్యానికేతన్ పాఠశాల వద్ద ఏవి నర్సింగరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.సుదాకర్, అడ్వైజర్ వివిరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శివప్రసాద్, మైఖేల్, చంద్రశేఖర్, రమణ, నారాయణ, పి.జె రెడ్డి, బాబురావు, కల్వల సత్యనారాయణ రావు పాల్గొన్నారు.

## లైసెన్స్ లేకుండా వాహనం నడుపవద్దు

### టీటీఐ ఎసిపి శంకర్‌రాజు

బేగంపేట మే 16, ప్రభాతవార్త : మోటారు వాహన చట్టం 1998 ప్రకారం లైసెన్స్ లేకుండా వాహనం నడపడం అండర్ సెక్షన్ 181బై 177ప్రకారం తీవ్రమైన ట్రాఫిక్ ఉల్లంఘన మరియూ భారత దేశంలో చట్ట విరుద్ధమని బేగంపేట ట్రాఫిక్ ట్రయినింగ్ ఇనిసిట్యూట్ ఏసీపీ జీ.శంకరరాజు అన్నారు. మంగళవారం బేగంపేట టీటీఐ లో నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల 2019 కొత్త మోటారు వాహన చట్టం సవరించబడిందని, దీని ఫలితంగా ట్రాఫిక్ జరిమానాలు పెరిగాయన్నారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ 5000లు వరకు జరిమానా విధించవచ్చన్నారు. గతంలో ఇది కేవలం రూ 500లు మాత్రమే ఉండేదని, 2022 సంవత్సరంలో హైదరాబాద్‌లో లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన వారిపైన మొత్తం 75348కేసులు బుక్ అయ్యాయని ఏసీపీ వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్ శ్యామల, కృష్ణ, నరేందర్, నర్సింహులు తదితరుల ఆధ్వర్యంలో బేగంపేట శ్రీశక్తి ఇనిసిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్ మెంట్‌లో ట్రాఫిక్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించి ఉద్యోగులకు ట్రాఫిక్ నిబంధనలు, భద్రతపై అవగాహన కల్పించారు.

## ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు

అల్వాల్, మే 16 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని మెడ్చెల్ మల్కాజిగిరి అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ తెలిపారు. హాత్ సే హాత్ జోడో యాత్ర మచ్చబొల్లారం డివిజన్‌లో జరిగింది. ప్రజలు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా యాత్రలో పాల్గొనడం కాంగ్రెస్ వర్గీయులులో ఆనందాన్ని కలిగించింది. రోడ్లు, మురికి కాలువలు, మంచి నీరు వంటి వసతులు లేక అవస్థలు పడుతున్నామని ప్రజలు మోర పెట్టుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, నిత్యావసర సరుకులు, పెట్రో ధరలు తగ్గిస్తామన్నారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలకు అధిక ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు చంద్రశేఖర్, డోలి రమేష్, సిఎల్ యాదగిరి, పవన్, కృష్ణగౌడ్, శ్రీనివాస్, సూర్యప్రకాష్ రెడ్డి, సంతోష్‌రెడ్డిచ వీనస్ మేరి, సుభాషిని, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్య ఉండదు

### కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్



మంచి నీటి పైపులైన్లు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

అల్వాల్, మే 16 ప్రభాత వార్త: మంచి నీటి సమస్య తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని వెంకటాపురం కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్ పేర్కొన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని సన్ రైజ్ కాలనీలో 16లక్షలు వ్యయంతో ఏర్పాటు చేయనున్న మంచినీటి పైపు లైను పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. డివిజన్ పరిధిలోని కాలనీలు బస్తీలులో మంచినీటి సమస్య లేదని సబిత అనీల్ కిషోర్ తెలిపారు. నూతనంగా వెలిసిన కాలనీలులో నివాసితుల సంఖ్యను బట్టి దశల వారీగా సమస్యలు అన్నింటిని పరిష్కరిస్తామని చెప్పారు. రోడ్లు, డ్రైనేజి, మంచినీటి వసతులు కల్పించడానికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి జిఎం సునీల్ బిఆర్ఎస్ నేతలు అనీల్ కిషోర్, భాస్కర్, సురేష్, చంద్రశేఖర్, సోమయ్య, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరిలో సామాజిక బాధ్యత కలిగి ఉండాలి : బన్నాల



వైద్యశిబిరంలో పాల్గొన్న బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, రాగిడి లక్ష్మారెడ్డి

నాచారం, మే 16 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరిలో సామాజిక భాద్యత కల్గి ఉండాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పేర్కొన్నారు. మంగళవారం ఆద్య పాలీ క్లినిక్ అండ్ ఫార్మసీ డా. కార్తీక్, శరత్ ఆద్వర్యంలో చిలుకానగర్ చౌరస్తాలో నేషనల్ డెంగ్యూ డే సందర్భంగా డెంగ్యూ అవేర్‌నెస్, ఉచిత వైద్యశిభిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొని క్యాంపును ప్రారంబించారు. ఈ సందర్భంగా బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ మంత్రి హరీష్ రావు ఆద్వర్యంలో ఆరోగ్య తెలంగాణ దిశగా కృషి చేస్తున్నారని కొనియాడారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్‌కు మంచి స్పందన ఉందన్నారు. మహిళలు డెలివరీ కోసం ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే చేరుతున్నారని పేర్కొన్నారు. బస్తీదావఖాలో ఎంతో మంది చికిత్స చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. అనంతరం రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి వైద్యశిభిరాలు నిరుపేదలకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి, ఎండి షఫీ, రవీందర్ గౌడ్, ఉపేందర్, సుందర్, ఎండి హనీఫ్, బొల్లెం లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు దాసరి కృష్ణ, బురుగుల రమేష్ గౌడ్, రాజ్యలక్ష్మి, కర్నె సంతోష్, అనుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## యువతిని వేధించిన కేసులో వ్యక్తికి సంవత్సరం జైలు, 4 వేల రూపాయలు జరిమానా

చార్మినార్, మే 16 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీ కామాటిపుర పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉందాబజార్‌కు చెందిన ఓ యువతిని వేధించిన కేసులో ఓ ముద్దాయికి నాంపల్లి చీఫ్ మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి డి.దుర్గా ప్రసాద్ మంగళవారం ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు నాలుగు వేల రూపాయలు జరిమానా విధించారు. కామాటిపుర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కొమరయ్య కథనం ప్రకారం.. ఉందాబజార్ బస్తీకి చెందిన ఓ యువతి 2017వ సంవత్సరం ఫిబ్రవరి నెల ఇరవై ఐదవ తేదీన డ్రస్సులు ఉతుకుతూ ఇంటి నుంచి బయటకు వస్తున్నది. అదే సమయంలో ఆమె ఇంటి ప్రక్కనే నివాసం ఉంటున్న రితేష్ అనే వ్యక్తి యువతి వద్దకు వచ్చి ఆమె చేతిని పట్టుకున్నాడు. రితేష్ బూతు మాటలు ఆడు తుండగ వెంటనే ఆమె కేకలు వేయటంతో తల్లి అక్కడకు వచ్చి రితేష్ చేతి నుంచి కూతురు చేతిని విడిపించింది. అక్కడ నుంచి వెళ్లి పోతూ రితేష్ మీ అంతు చూస్తానని బెదిరించాంచాడు. అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కామాటిపుర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కొమరయ్య ఆధ్వర్యంలో పిసి జయరాం సాక్ష్యాలను కోర్టుకు అందజేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుధాకర్ వాదనలు వినిపించగా, న్యాయమూర్తి డి.దుర్గా ప్రసాద్ నిందితుడైన రితేష్‌కు ఒక సంవత్సరం పాటు జైలు శిక్షతో పాటు నాలుగు వేల రూపాయలు జరిమానా విధించారు. ఈ కేసును కామాటిపర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నూతన పోలీస్ స్టేషన్ భవనాల నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలి

### మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



రాష్ట్ర సచివాలయంలో సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని పోలీస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని

బేగంపేట మే 16, ప్రభాతవార్త : నూతన పోలీస్ స్టేషన్ భవనాల నిర్మాణ పనులను ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణా రాష్ట్ర సచివాలయంలో సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని పోలీస్‌శాఖ అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నార్త్‌జోన్ డీసీపీ చందనా దీప్తి, మహంకాళీ, బేగంపేట, గోపాలపురం, సనత్‌నగర్, గాంధీనగర్, ఎస్సార్‌నగర్ ఏసీపీలు, ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని గాంధీనగర్, గోపాలపురం, బేగంపేట మహిళా పోలీస్‌స్టేషన్ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అదే విధంగా మారేడుపల్లి పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి కూడా నిధులు మంజూరై ఉన్నాయని విశాల మైన భవన నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన స్థలాన్ని వీలైనంత త్వరగా సేకరించి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆదేశాల మేరకు ప్రభుత్వం అన్ని హంగులతో కూడిన నూతన పోలీస్ స్టేషన్ భవనాల నిర్మాణం చేపట్టిందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న అనేక పోలీస్‌స్టేషన్ భవనాలలో కొన్ని శిధిలావస్థకు చేరి మరికొన్ని సరైన సౌకర్యాలు లేకపో వడం, మరికొన్ని సౌకర్యవంతంగా లేకపోవడం వలన పడుతున్న ఇబ్బం దులను దృష్టిలో ఉంచుకొని అన్ని సౌకర్యాలతో కార్పొరేట్ కార్యాలయాలను తలపించే విధంగా నూతన పోలీస్‌స్టేషన్ భవనాలను నిర్మించిన విషయాన్ని గుర్తు చేసారు. నేరాల నియంత్రణ, శాంతి భద్ర తల పర్యవేక్షణలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎంతో ప్రాధాన్యత ఏర్పడిం దని వివరించారు. నియోజకవర్గం పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్ లో పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం గత సంవత్సరం తన నియో జకవర్గ అభివృద్ధి నిధుల నుంచి 84లక్షల రూపాయలను అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ సంవత్సరం కూడా ఇంకా మరికొన్ని ప్రాంతాలలో సీసీ కెమెకరాల ఏర్పాటు కోసం కోటి రూపాయల వరకు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఏసీపీలు పృధ్వీధరరావు, రమేష్, సుధీర్, యాదగిరి, మోహన్‌కుమార్, ఇన్స్‌పెక్టర్లుకావేటి శ్రీనివాసులు, నాగేశ్వరరావు, మోహన్‌రావు, నరేష్, లింగేశ్వర్, సైదులు, నేతాజీ, పి.శ్రీనివాసరావు, ముత్తుయాదవ్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు.. విజేతలకు బహుమతులు



,భద్రతా వారోత్స వాలలో భాగంగా హీరో ట్రాఫిక్ పార్కులో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

బేగంపేట మే 16, ప్రభాతవార్త : ఐక్యరాజ్య సమితి గ్లోబల్ రహదారి బధ్రతా వారోత్సవాలలో(మే 15నుంచి 21వరకు) భాగంగా బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఏసీపీ జి.శంకరరాజు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణా అకాడమీ ఫర్ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్, బేగంపేటలో నిర్వహించిన కార్యక్రమంలో అక్కడి ఉద్యోగులకు ట్రాఫిక్ రోడ్డు బధ్రతపై వీడియోలతో అవగాహన కల్పించారు. హీరో ట్రాఫిక్ పార్కులో నారాయణ మహా విద్యాలయ చిన్నారులకు రహదారి బధ్రత పై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ట్రాఫిక్ ట్రయినింగ్ ఏసీపీ శంకరరాజు, ఇన్స్‌పెక్టర్ నాగరాజు చేతుల మీదుగా బహుమతుల ప్రధానం చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్లోబల్ రోడ్ సేఫ్టీపై వివరించారు. వీలైనంత మేరకు సైకిల్ మరియూ ఇతర ప్రజా రవాణా వ్యవస్థలను ఉపయోగించాలని వారు ఈ సందర్భంగా వారికి సూచించారు. ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ ఇతరులను కూడా పాటించేటట్లు చేయాలని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐటీ అండ్ ఈ మేనేజర్ సతీష్, హీరో పార్కు నిర్వహకులు విద్యాలయ ప్రిన్సిపాల్, ట్రాఫిక్ ట్రయినింగ్ మహిళా హెడ్ కానిస్టేబుల్ వీరమ్మ, సుమన్‌లు పాల్గొన్నారు.

## అమ్మవారి విగ్రహా పునఃప్రతిష్టాపన

శామీర్‌పేట, మే 16, ప్రభాతవార్త : ఉప్పరిపల్లిలో శ్రీపెద్దమ్మ తల్లి విగ్రహాపునప్రతిష్ట సందర్భంగ ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని ఉప్పరిపల్లి గ్రామంలో అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, గ్రామంలో విగ్రహా ఊరేగింపు, ఆలయం వద్ద యజ్ఞహోమాలు ఘనంగ జరిగాయి. ఆ తరువాత ఆలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమం జరిగింది.



దక్షిణ మధ్య రైల్వే డి.ఆర్.ఎం. అభయ్‌కుమార్ గుప్తను కలిసిన దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నేతలు

## రైల్వే డి.ఆర్.ఎం.ను కలిసిన మజ్దూర్ యూనియన్ నేతలు

కంటోన్మెంట్, మే 16 ప్రభాతవార్త: దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ అధ్యక్షులుగా నియామకమైన సందర్భంగా మంగళవారం దక్షిణ మధ్య డివిజనల్ మేనేజర్ అభయ్‌కుమార్ గుప్తను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. డిఆర్.ఎం.ను కలిసిన వారిలో ఎస్.సి. ఆర్. మజ్దూర్ యూనియన్ జోనల్ అధ్యక్షులు కె.శ్రీనివాస్, డివిజనల్ కార్యదర్శి కాంమ్రేడ్ రవిందర్, డివిజనల్ అధ్యక్షులు ఖాజా బాబా, బ్రాంచ్ కార్యదర్శిలు యుగంధర్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల సేవలు అమోగం : జంపన విద్యవతి

కంటోన్మెంట్, మే 16 ప్రభాతవార్త: కాలనీలను, బస్తీలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమోగమని కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యురాలు జంపన విద్యవతి తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం కంటోన్మెంట్ 1వ వార్డులో పనిచేస్తున్న స్పారిశుధ్య మహిళా కార్మికులకు జంపన విద్యవతి ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, నర్సింహ్మా, శ్రీధర్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రైస్తవుల ఆస్తులపై దాడిచేసే వారిపై చర్యలు తీసుకోవాలి

### నేషనల్ క్రిస్టియన్ బోర్డు అధ్యక్షులు జాన్ మాస్క్




సమావేశంలో మాట్లాడుతున్న జాన్ మాస్క్, సురేష్ తదితరులు

హైదరాబాద్, మే 16, ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గా ల్లోని క్రైస్తవులు, వారిఆస్తులపై దాడులకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నేషనల్ క్రిస్టియన్ బోర్డు అధ్యక్షులు జాన్ మాస్క్ అన్నారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఈరెండు నియోజకవార్గాలల్లో 40మంది క్రైస్తవుల ఆస్తులపై దాడులు జరిగాయని అయినా అక్కడి ఎమ్మెల్యేలు ఎవరూ పట్టించుకోలేదన్నారు. ముఖ్యంగా కుత్బుల్లాపూర్ నియోజకర్గంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతి నిధులు, అధికారులు కుమ్మక్కై క్రైస్తవులపై వివక్షత చూపుతున్నారన్నారు. తక్షణమే ఆయా నియోజకవర్గాల్లోని క్రైస్తవులపై దాడులు అపాలని లేకుంటే కలెక్టర్, ఎంఆర్ఓ కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు. ఇప్పటికే పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల్లోగా తమ ఫిర్యాదులను పట్టించుకుని చర్యలు తీసుకోవాలని లేకుంటే నియోజకర్గంలోని 6వేలమంది పాస్టర్లతో కాలినడకన వెళ్ళి ప్రభుత్వ పెద్దలను కలుస్తామన్నారు. ప్రతినిధులు సురేష్, భద్రేష్, ప్రసాద్, మేఘనా పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలి

### ప్రమాదాలను అరికట్టడానికి చర్యలు చేపట్టాలి : మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 16, ప్రభాతవార్త : రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, జిల్లా వ్యాప్తంగ రోడ్డు ప్రమాదాలు జరగకుండ తగు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రోడ్డు భద్రతలపై రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్, జిల్లారవాణా శాఖ, భారత జాతీయ రహదారులు సంస్థ, పోలీసు, ట్రాఫిక్ పోలీసు, ఆర్టీసి, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగ కలెక్టర్ అమోయ్‌కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను అరికట్టటానికి అధికారులు అందరు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగ నేషనల్ హైవేస్ ఉన్నట్లు ఆయా ప్రాంతాల్లో ఎక్కడ కూడ ప్రమాదాలు జరగకుండ అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు పాటించేలా చూడాలని, అధికారులు కూడ బ్లాక్ స్పాట్‌లుగ గుర్తించిన ప్రాంతాల్లో స్ట్రిప్స్, స్టడ్స్, సూచిక బోర్డులు, బ్లింకర్స్ వంటివి ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన చోట సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, రాష్ట్ర రహదారుల ఇంజనీరింగ్ అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రమాదాలు జరిగిన తరువాత జాగ్రత్తలు తీసుకునే కంటే ప్రమాదాలు జరగకుండ ముందస్తుగానే స్పీడ్‌లిమిట్స్ బోర్డులను, స్పీడ్ గన్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. దీంతో వాహనాదారులు ఎక్కువ స్పీడ్‌తో వెళ్లకుండ నిర్ణీత వేగంలో వెళ్లటానికి అవకాశం ఉంటుందన్నారు. గతంలో రోడ్డు ప్రమాదాలు జరిగిన చోట, మూలమలుపుల వద్ద ప్రత్యేకంగ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖ అధికారులు ప్రత్యేకంగ ప్రజలకు అవగాహణ కల్పించాలని కలెక్టర్ అమోయ్ కుమార్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య, డిఆర్ఓ లింగ్యానాయక్, ఆర్అండ్‌బి ఈఈ శ్రీనివాస్‌మూర్తి, ఆర్టీఓ కిషన్‌నాయక్, పిఆర్‌ఇఇ, పోలీసు అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, జాతీయ రహదారుల అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

నిట్ నెం: 12/DIV.13 (Old-7B)/GHMC/2023-2024
పనిపేరు: సివిల్ పనులు (12నం.). అంచనా మొత్తం : రూ.101.75 లక్షలు. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ/ చివరి తేదీ, సమయం: 16.05.2023 సా.4.00గం., 19.05.2023 సా.4.00గం. అధికారి పేరు మరియు చిరునామా సెల్ నెం : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.13 (Old-7B), (KZ), GHMC, ఖైరతాబాద్, హైదరాబాద్. ఫోన్: 9154960552. తదుపరి వివరాలు www.Tender.eprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.13 (Old-7B), GHMC.
DIPR.No.1807-PP/CL/Advt/1/2023-24 తేదీ: 16.05.2023

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన నిర్వహణ పనులు
నిట్ నెం.05/EE-7(4B)/CRZ/GHMC/2023-24, పని పేరు: క్ర.సం.1 నుండి 4 వరకు, అంచనా ధర (రూ.లక్షలలో) రూ.20.36 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: డౌన్‌లోడ్ ప్రారంభం: తేది: 17.05.2023 ఉ.01.00 గం. వద్ద, చివరి తేది: 20.05.2023 ఉ.01.00 గం. వద్ద. అధికారి పేరు, చిరునామా, సెల్ నెం: శ్రీ యు. బస్వరాజ్ EE సంతోష్‌నగర్, సర్కిల్-7, చార్మినార్ జోన్, మస్తాబ్ గ్రౌండ్, దరబ్‌జంగ్ కాలనీ, సంతోష్‌నగర్, హైదరాబాద్, ఫోన్ నెం.7799552216. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సంతోష్‌నగర్, సర్కిల్-7, చార్మినార్ జోన్, GHMC
DIPR.No.1790-PP/CL/Advt/1/2023-24, తేది: 16.05.2023

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

క్ర.సం., నిట్ నెం.02/CTO/GHMC/2023-24, తేది 11.05.2023, పని పేరు: డైరెక్టరేట్ EV&DM GHMC యొక్క డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (DRF)కు 3 సంవత్సరాల AMC తోసహా GVW యొక్క 10-12 టన్ సామర్థ్యం కలిగిన 4 నం.ల కస్టమైజ్‌డు ట్రక్కుల సరఫరా మరియు డెలివరీ, బిడ్స్ స్వీకరణ ప్రారంభ/చివరి తేదీలు, సమయం, ప్రారంభ తేది: 12.05.2023 మ.3.00 గం. ఆపైన, ముగింపు తేది: 26.05.2023 మ.03.00 గం. అధికారి పేరు, చిరునామా, సెల్ నెం: చీఫ్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్ కార్యాలయం, 4వ అంతస్తు, GHMC హెడ్ ఆఫీస్, ట్యాంక్‌బండ్, హైదరాబాద్. శ్రీ కె. అజయ్ CTO, GHMC. సంప్రదించవలసిన మొబైల్ సం.7993360314. సంబంధిత అధికారి చిరునామా: పైన పేర్కొన్నది. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.eprocurement.telangana.gov.in వద్ద చూడవచ్చును.
DIPR.No.1802-PP/CL/Advt/1/2023-24, తేది: 16.05.2023 సం/- చీఫ్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ GHMC తరపున

## వడ దెబ్బతో యాచకురాలు మృతి

మైలార్‌దేవ్‌పల్లి, మే 16 ప్రభాతవార్త : వడ దెబ్బకు ఓ యాచకురాలు మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బాపూఘాట్ బ్రిడ్జి వద్ద మంగళవారం ఉదయం గుర్తు తెలియని నలభై సంవత్సరాలు వయస్సు గల మహిళ మృతి చెంది ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గుర్తు తెలియని మహిళ మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. చని పోయిన మహిళ బాపూ ఘాట్ బ్రిడ్జి కింద చెత్త కాగితాలు, ప్లాస్టిక్ వస్తువులు ఏరుకుని జీవిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని మహిళ వడ దెబ్బకు మృతి చెంది ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఆమెకు సంబంధించిన వారు ఎవరైనా ఉంటే రాజేంద్రనగర్ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ మౌనిక కోరారు. ఈ కేసును రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

IN THE HONOURABLE COURT OF THE VII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD

O.S No.4641 OF 2021

Between:
ICICI Bank LIMITED ...Plaintiff
AND
Venkatesh Nerukurti ...Defendant

To
1. Venkatesh Nerukurti
S/o Anasurya RamaRao
Age Major Occ Business
R/o Zer Manjil Flat No 401,
Plot 105, 13-1-17-/3, 4th floor,
Bada Function Hall, Saptagiri
Colony,Moti Nagar
Borbanda Hyderabad-18 ...Defendant

Whereas the above named plaintiff filed suit against the defendants for Recovery of Claim and the same is posted to 20-06-2023 at 10-30 A.M for your appearance. You are hereby directed by the Hon'ble Court to appear before the said Court on the date and time mentioned above. Otherwise the matter will be heard on your absence.

//BY ORDER OF THE COURT//
B. PRAVEEN KUMAR
Advocate

PUBLIC NOTICE
LOSS OF DOCUMENT

The General public are hereby informed that my client Sri GUNTAKA SURYA NARAYANA REDDY, S/o. G. Rama Chandra Reddy, Occ: Agriculture, R/o. H.No. 3-5-101, Vivekananda Nagar Colony, Kukatpally, Hyderabad., Lost his original sale deed and link documents number 1). 9739/2006 dated 18.12.2006 and Link Document No.3933/2005 duly registered at SRO Narsapur, Medak Dist has been lost by him while travelling by auto from Vivekananda nagar Colony to Kandi on 8/5/2023, and he also got lodged a police complaint at Kukatpally Police station, If any body found that documents may misuse it therefore, the general public are hereby informed not to deal with the said property, in spite of this notice if anybody enters any transition my client not responsible for the same.

ERGATLA VINOD
Advocate
H.No.2-43, Sai Nagar, Chaitanyapuri, Hyderabad.
Cell: 8897775986

COURT NOTICE

IN THE COURT OF THE Ist ADDITIONAL JUNIOR CIVIL JUDGE, MEDCHAL MALKAJGIRI DISTRICT, AT MALKAJGIRI
O.S. NO. 912 OF 2021

BETWEEN:
Smt. D. Venkata Lakshmi & Anr. ...Plaintiffs
AND
Smt. Kuldeep Kaur & Ors. ...Defendants

To,
Sri. D. Nagender, S/o. Late. D. Parameshwar Yadav, Aged 58 years, Occ: Govt. Service, R/o. IIIrd Floor, Sita Residency, 1-10-313/11A, Near Hanuman Temple, 6th Lane, Begumpet. ...Defendant No. 3

Please be informed that the Plaintiffs named hereinabove has filed the above suit seeking the relief of declaration of Title, recovery of possession and declaration of sale deed as null and void against the Defendants herein and the Court was pleased to order summons to you and has posted the matter on 08-06-2023 for your appearance. You are hereby directed to appear in the aforementioned case on 08-06-2023 at 10:30AM either in person or through Counsel, failing which the Court will proceed to adjudicate the matter on merits in your absence.

-BY ORDER OF THE COURT-
Sd/- K. MOHAN,
B. SRINATH REDDY,
G. RAM BABU,
M. VIJAYA KRISHNA,
NITISH KAROOR, Advocates,
Flat No. 14, Ist Floor, Madhukunj Apartments, S.P. Road, Opp. City Civil Court, Secunderabad, Secunderabad-03.

# కార్పొరేషన్లకు ధీటుగా జల్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధి : మంత్రి


మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి : పక్కన కమీషనర్ వసంత, ఛైర్మన్ అబ్దుల్లా సాది

**సరూర్‌నగర్, మే 16 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపాలిటీలో ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించి మున్సిపాలిటీని అభివృద్ధిపథంలోకి తీసుకుపోతున్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని 6, 8, 28 వార్డులలో రూ.66.50 లక్షల నిధులతో చేపట్టిన సిసిరోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులకు సోమవారం సాయంత్రం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని మీర్‌పేట్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్లకు ధీటుగా జల్‌పల్లి మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ మున్సిపాలిటీ గతంలో కంటే మెరుగైన అభివృద్ధి సాధించిందని ఆమె వెల్లడించారు. అన్ని వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలు, మంచి నీటి సరఫరా, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. అదే విధంగా చెరువుల సుందరీకరణ, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఆధునిక వైకుంఠ ధామాల నిర్మాణం చేయిస్తున్నామన్నారు. ముమ్ముందు జల్‌పల్లి మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేస్తామని సబితారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ వసంత, ఛైర్మన్ అబ్దుల్లా సాది, మాజీ వైస్ ఎంపిపి ఒమర్ బామ్, అహ్మద్ కసాది, శంషుద్దీన్, మజహర్ అలీ, నియోజకవర్గ బిఆర్ఎస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఖైసర్ బామ్, మున్సిపాలిటీ బిఆర్ఎస్ అధ్యక్షుడు ఇక్బాల్ బిన్ ఖలీఫా, వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్, అధికార ప్రతినిధి అబ్దుల్ రవూఫ్, షాకీర్ మీర్జాబేగ్, అబ్దుల్లా బిన్‌గాలిబ్, అంజాద్ భాయ్, మహబూబ్ హసన్ బాబా, సయ్యద్ బిన్ హజబ్ తదితరులు పాల్గొన్నారు.

## డెంగీ వ్యాధిని నివారించాలి : జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

**ఎల్.బి.నగర్, మే 16 ప్రభాతవార్త :** డెంగీ వ్యాధిని సమూలంగా నివారించాలని జిల్లా వైద్యధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రాకేష్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి అవగాహన కార్యక్రమానికి వెంకటేశ్వర్‌రావు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. వైద్యాధికారులకు, ఆరోగ్య సిబ్బందికి డెంగీ నివారణకు తీసుకోవలసిన చర్యలను తెలియజేసారు. మలేరియా రాష్ట్ర స్థాయి అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ దోమలనివారణ, దోమకాటువల్ల వ్యాప్తి చెందే వ్యాధుల గురించి తెలియజేశారు. డెంగీని పట్టణ, పరిసర పట్టణ ప్రాంతాల్లో ఏ విధంగా నివరించాలో వివరించారు, మున్సిపల్ సిబ్బంది తో సంయుక్తంగా పనిచేసి దోమల నివారణ చేయాలని, ఫ్రైడే – డ్రైడే కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలని కోరారు. అనంతరం నిర్వహించిన అవగాహన ర్యాలీని వెంకటేశ్వర్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఎచ్ఓ డాక్టర్ గీత, స్థానిక వైద్యాధికారి డాక్టర్ అర్చన, కమ్యూనిటీ ఆరోగ్య అధికారులు రఘు, జ్ఞానేశ్వర్, సూపర్వైజర్లు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్స్, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలి : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి


గవర్నర్ తమిళసైకి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**మలక్‌పేట, మే 16 ప్రభాతవార్త :** జిహెచ్ఎంసి కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి డిమాండ్ చేసారు. కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ బిజెపి ఫ్లోర్ లీడర్, జిహెచ్ఎంసి విప్, కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, బిజెపి కౌన్సిల్ కమిటీ సభ్యులు గవర్నర్ తమిళసై కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిహెచ్ఎంసి 6వ సర్వ సభ్య సమావేశం ప్రజా సమస్యల పై చర్చ లేకుండానే ప్రతిపక్ష బిజెపి కార్పొరేటర్లపై నింద మోపుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించడం, ఆ నిర్ణయానికి మద్దతుగా జోనల్ కమిషనర్ వంత పాడుతూ కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించి స్థానిక సంస్థల హక్కులను కాలరాస్తూ అటు మేయర్‌ను, ఇటు కౌన్సిల్ సభ్యులను అవమానపరుస్తూ చట్ట వ్యతిరేక నిర్ణయం తీసుకున్న అధికారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వంనుండి ఎటువంటి ప్రతిస్పందన లేకపోవడంతో గవర్నర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగిందన్నారు.

## రైతు సంక్షేమం కోసం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు : కొత్తకుర్మ సత్తయ్య


పాలకవర్గ సమావేశంలో పాల్గొన్న సంఘం అద్యక్షుడు సత్తయ్య, డైరెక్టర్లు

**తుర్కయాంజల్, మే 16 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ సంఘ పాలక వర్గ సమావేశము సంఘం అధ్యక్షులు కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన సంఘం ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో 25 మంది నూతన సభ్యులుగా చేర్చుకోవడం జరిగింది. 45 మంది రైతులకు 3 కోట్ల 75 లక్షల రూపాయలు అప్పులు మంజూరు చేసారని, 2022-23 ఆర్థిక సంవత్సరం ముగింపు లెక్కలను ఆమోదించారు. సభ్యుల సంక్షేమం కోసం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాడడానికి ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షులు, వంగేటి లక్ష్మారెడ్డి, వైస్ ఛైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు చెక్క లక్ష్మమ్మ, సామ సంజీవరెడ్డి, కుతాడి నర్సింగ్‌రావు, చాపల యాదగిరి, శీలం లక్ష్మమ్మ, జక్క కృష్ణరెడ్డి, సామ సత్యనారాయణరెడ్డి, జిట్టా భార్గవి, సీఈఓ రాందాస్ పాల్గొన్నారు.

## భాగ్యనగర్ సొసైటీ అభివృద్ధిపై సమీక్ష

**సరూర్‌నగర్, మే 16 ప్రభాతవార్త:** నాదర్‌గుల్‌లోని భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘంలో మంగళవారం సొసైటీ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. నెలవారీ సమావేశంలో భాగంగా ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి అధ్యక్షతన సొసైటీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో డైరెక్టర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అభివృద్ధిపై ఛైర్మన్ చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ బంగారు బాబు, డైరెక్టర్లు పెత్తుల్ల పుల్లారెడ్డి, యెల్చల సుదర్శన్ రెడ్డి, తోట ప్రతాప్‌రెడ్డి, తిరుపతి గిరిరాజు, సప్పిడి కొండల్‌రెడ్డి, సొసైటీ మేనేజర్ పిండి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మేరీ లైఫ్ మేర స్వచ్‌షెహర్‌లో భాగస్వాములు కావాలి: కమిషనర్

**హయత్‌నగర్, మే 16 ప్రభాతవార్త:** మేరీ లైఫ్ మేర స్వచ్ షెహర్ కార్యక్రమంలో భాగంగా పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలో నాలుగు రెడ్యూస్, ర్యూస్, రీసైకిల్ సెంటర్లను (ఆర్.ఆర్.ఆర్) ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈనెల 20 నుంచి పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీకార్యాలయం, పసుమాముల, కుంట్లూర్, తట్టిఅన్నారంలోని వార్డు కార్యాలయాల వద్ద ఈసెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆయావార్డుల ప్రజలు తమ ఇళ్లల్లోని పాత, ఉపయోగపడని వస్తువులు వార్తాపత్రికలు, పుస్తకాలు,ప్లాస్టిక్, అల్యూమినియం సామాన్లు, రెక్సిన్, రబ్బరు వస్తువులు, దుస్తులు, ఇతర థర్మకోల్ ఆటవస్తువులు వంటి వాటిని ఆర్.ఆర్.ఆర్ సెంటర్లకు తీసుకువచ్చి ఇవ్వాలని కమిషనర్ సూచించారు.

## నిధులు మంజూరైన పనులు జరగడం లేదు : కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్


శిలాఫలకాన్ని పాలతో శుభ్రం చేస్తున్న శ్రీవాణి

**ఎల్.బి.నగర్, మే 16 ప్రభాతవార్త :** అభివృద్ధిపనులకోసం నిధులు మంజూరైన పనులు మాత్రం ప్రారంభించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరుగున పడిన శిలాఫలకాన్ని పాలతో శుభ్రం చేయడం జరిగింది. డివిజన్లోని కాలనీలు, బస్తీలలో డ్రైనేజీ సమస్య కనుక్కొని మ్యాపింగ్ వేయించి అధికారులకు వినతి పత్రాలు ఇస్తే రూ.84 లక్షలు మంజూరి కాగా మంత్రి పనులకు శంకుస్థాపనచేసి ఏడాది పూర్తయిన నేటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో మంగళవారం శిలాఫలకాన్ని పాలతో శుభ్రం చేసి నిరసన వ్యక్తం చేశారు. పనులు పూర్తి చేయమని ఎన్ని వినతి పత్రాలు ఇచ్చిన పనులు ఎందుకు ప్రారంభించడం లేదని ఆమె ప్రశ్నించారు. దీంతో స్థానిక ప్రజలు సమస్యలతో బాధపడుతూనే ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మూర్తి, లావణ్య, నరసింహారెడ్డి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## పాత పనులకు ప్రారంభోత్సవాలా?: చెరుకుపల్లి

**సరూర్‌నగర్, మే 16 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 31వ డివిజన్‌లో సుమారు రెండు సంవత్సరాల క్రితం నిర్మించిన సిసి రోడ్లకు తాజాగా ప్రారంభోత్సవాలుచేయడంపై కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి అభ్యంతరం తెలిపారు ఈ నెల 13న డివిజన్‌లో జరిగిన కార్యక్రమాలకు హాజరైన మంత్రి, మేయర్ ఎప్పుడో పూర్తయిన సిసి రోడ్డును ప్రారంభించారని ఆయన అన్నారు. పాత పనులకు ప్రారంభోత్సవాలు జరగడంపై ప్రజలు కూడా ఆశ్చర్యపోతున్నారని ఆయన వెల్లడించారు. కార్పొరేషన్ లోని వివిధ ప్రాంతాల్లో గతంలో వేసిన శిలాఫలకాలకు సంబంధించిన పనులు పూర్తికాక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారనీ అయితే వాటిని పూర్తి చేయించడంలో జాప్యం జరుగుతున్నదని ఆయన విమర్శించారు. తాను చేస్తున్న ఆరోపణలకు కట్టుబడి ఉన్నాననీ తన వ్యాఖ్యల్లో వాస్తవం లేదని తేలితే దేనికైనా సిద్ధమని వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు.

## సమాజానికి సేవలు అందిస్తా : సాలికేజియా


సాలికేజియాకు డాక్టరేట్ అందజేస్తున్న దృశ్యం

**మలక్‌పేట, మే 16 ప్రభాతవార్త :** సమాజానికి ఎల్లప్పుడూ సేవలు అందిస్తామని నగరానికి చెందిన ప్రముఖ సంఘ సేవకురాలు, హ్యూమన్ రైట్స్ ఆర్గనేజేషన్ సిఇఓ సాలికేజియా పేర్కొన్నారు. సమాజానికి తాను చేస్తున్న సేవలను గుర్తించి జర్మనీకి చెందిన ఇంటర్‌నేషనల్‌పీస్ యూనివర్సిటీ నిర్వాహకులు ఆమెకు డాక్టరేట్ ప్రధానం చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీస్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రధానం చేయడం సంతోషంగా ఉందని, తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో డిస్ట్రిక్ట్ గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారిగా విధులు నిర్వహించి వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఉపాధ్యాయులకు 3793 శిక్షణా శిబిరాలు నిర్వహించడంతోపాటు,ప్రభుత్వ పాఠశాలలో 68972 మంది బాలికలకు 278 మెడికల్ క్యాంపులు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజలకు తమ హక్కుల సంరక్షణకోసం న్యాయ సహాయం అందించడం జరుగుతుందన్నారు. మానవ హక్కులు, సేవ్ విద్యుత్, సేవ్ వాటర్, ప్లాంటేషన్ తదితర వాటిపై అవగాహన కార్యక్రమాలు, జాతీయ, అంత ర్జాతీయ సమావేశాలలో గ్లోబల్ పీస్‌పై మోటివేషనల్ ప్రసంగాలు ఇస్తున్నామని తెలిపారు.

## క్రీడలలో రాణించినపుడే దేశానికి ప్రగతి


క్రీడలలో పాల్గొన్న క్లబ్ ప్రతినిధులు, ముఖ్య అతిథులు తదితరులు

**వనస్థలిపురం, మే 16 ప్రభాతవార్త:** వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ వి 102 ఎ ఆధ్వర్యంలో వనసలిపురం సచివాలయనగర్‌లో గల షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో చెస్ ఛాంపియన్‌షిప్,షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. వాసవి క్లబ్ ఇంటర్ నేషనల్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా జరిగిన ఈ పోటీలలో రన్నర్స్, విన్నర్స్‌గా నిలిచిన విజేతలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన వాసవి క్లబ్ ఇంటర్ నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ విట్టా దూరయ్య, డిస్ట్రిక్ట్ గవర్నర్ భాస్కర్‌గుప్తాల చేతుల మీదుగా బహుమతులను అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాసవి క్లబ్‌ల ఆధ్వర్యంలో అనేక సామాజిక సేవాకార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. అన్ని రంగాల్లో వాసవి క్లబ్ ప్రతినిధులు తమ వంతు సహాయ సహకారాలను అందిస్తున్నామన్నారు. ఈ నెల 22న విజయవాడలో జరిగే ఫైనల్స్ పోటీలకు ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు పంపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రీజియన్ ఛైర్మన్ అత్తులూరి మల్లికార్జునరావు, వైస్ ప్రెసిడెంట్ యర్రమల్ల శ్రవన్‌కుమార్, వాసవి క్లబ్ ఇంటర్‌నేషనల్ డైరెక్టర్ మర్యాల చంద్రమౌళిగుప్త, సచివాలయనగర్ కాలనీఅధ్యక్షుడు కూర్మారావు, హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, క్యాబినెట్ సెక్రటరీ కొత్తమాసు రమేష్, సూరిశెట్టి నర్సింహ్మ గుప్త, డిస్ట్రిక్ట్‌ఇంఛార్జి ఆలేటి రవికుమార్, బాదం జగదీశ్వర్, అల్లాడి పరమేష్, నీలా విజయలక్ష్మి, విట్టా సాయిమోహన్, విజయసంతోష, స్వరూప, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న కెసిఆర్ కుటుంబం : బండి సంజయ్


ఝాన్సీతో మాట్లాడుతున్న బండి సంజయ్

**ఎల్.బి.నగర్, మే 16 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం తెలంగాణ రాష్ట్ర విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల దాడిలో గాయపడి చికిత్స పొంది తన ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి కుమారి ఝాన్సీని దిల్‌సుఖ్‌నగర్ మధురాపురికాలనీలోని ఏబీవీపీ కార్యాలయంలో మంగళవారం కలిసిన బండి సంజయ్ ఆమెను పరామర్శించి, జరిగిన ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ గురునానక్, శ్రీనిధి కాలేజీల వలన సుమారు నాలుగు వేల మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని ఏబీవీపీ ఆందోళనకు దిగుతుంటే అక్రమ అరెస్టులు చేసి విద్యార్థినులపై పోలీసులు విచక్షణారహితంగా వ్యవహరించడం సిగ్గుమాలిన చర్య అన్నారు. నాలుగు వేల మంది విద్యార్థుల భవిష్యత్తు కాపాడాలని పోరాడేది ఏబీవీపీ అని ఆయన అన్నారు. మొదలు ఏబీవీపీపై ప్రభుత్వం తెలుసుకోవాలని, ఏబీవీపీ ఏ రాజకీయ సంస్థ కాదని, విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాడే సంస్థ అనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉద్యమం చేపడుతున్న వారిపై ప్రభుత్వం అణచివేసే ధోరణి సరైంది కాదన్నారు. కెసిఆర్ కుటుంబం, ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే వేలాదిమంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. అకాల వర్షాలతో రైతులకు ఎకరాకు పది వేల రూపాయలు ఇస్తానని మాట ఇచ్చి మాట తప్పడం కెసిఆర్‌కు చెల్లిందన్నారు. ఉద్యోగస్తులకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మరో వైపు నిరుద్యోగులకు నోటిఫికేషన్లు రాక రోడ్ల మీదికి వస్తున్నారని, వచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్, పేపర్ లీకేజీల వ్యవహారంలో లక్షల మంది నిరుద్యోగ యువత జీవితాలు నాశనం చేశారని విమర్శించారు. లీకేజీలకు పాల్పడ్డ వారు బెయిల్ తీసుకుని బయటకు వచ్చి జల్సాలు చేస్తున్నారని తెలిపారు. వీటన్నింటికి కారణమైన కేసీఆర్ కుమారుడు మంత్రి కేటీఆర్ లండన్‌కు పోయి ఎంజాయ్ చేస్తున్నాడని ఆరోపించారు. బిఆర్ఎస్ ప్రభుత్వానికి దోచుకోవడం, దాచుకోవడం, గలీజు దందాలు చేయడం, తెలంగాణ ప్రజానీకం ఎటుపోయిన వారికి అక్కరలేదని తీవ్ర స్థాయిలో విమర్శలు చేయడం జరిగింది. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు దాసరి మల్లేష్, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, దాసరి జయప్రకాష్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## జూనియర్ పంచాయతీ కార్యదర్శి సోని కుటుంబానికి న్యాయం చేయాలి: గుడ్ల



కొవ్వొత్తులతో సంతాపం వ్యక్తం చేస్తున్న గుడ్ల శ్రీనివాస్

**సరూర్‌నగర్, మే 16 ప్రభాతవార్త:** జూనియర్ పంచాయతీ కార్యదరుశ్యలను పర్మినెంట్ చేయాలని నిరవధిక సమ్మె చేసి విరమించిన మరుసటి రోజే ఆత్మహత్య చేసుకున్న వరంగల్ జిల్లా ఖానాపురం మండలం రంగాపురం జూనియర్ పంచాయతీ కార్యదర్శి బైరి సోని కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని మహేశ్వరం నియోజకవర్గ బిఎస్‌పి అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోని మృతికి సంతాపసూచకంగా బిఎస్‌పి ఆధ్వర్యంలో బడంగ్‌పేట్‌లో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మె చేసిన తర్వాత ఉద్యోగం నుండి తొలగిస్తారనే ఆందోళనతోనే సోని ఆత్మహత్య చేసుకున్నదని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి ఎక్స్‌గ్రేషియాతో పాటు సోని ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు మహేష్‌చారి, ఇందుమతి, నడ్డి నర్సింహ, భాగ్యరాజ్, లక్ష్మీదాస్, రాజశేఖర్, పవన్, గుడ్ల జ్ఞానేశ్వర్, అనిత, లలిత, మధుకర్, మహేష్, అవినాశ్, శివ, చంద్రశేఖర్, సరిత, రాహుల్, కృష్ణ, సబిత, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించిన పేద విద్యార్థి


మణికంఠను సన్మానిస్తున్న ఉపేందర్ గుప్తా

**ఎల్.బి.నగర్, మే 16 ప్రభాతవార్త :** దాతల సహకారంతో విద్యాభ్యాసం చేసిన పేద విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని మొగుళ్ళపల్లి యువసేన నిర్వాహకుడు డాక్టర్ మొగుళ్ళపల్లి ఉపేందర్‌గుప్తా తెలిపారు. మొగుళ్ళపల్లీ యువసేన ఉపేందర్‌గుప్తా ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాల చదువు పూర్తి చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించిన పెంద్యాల మణికంఠను మంగళవారం మొగుళ్ళపల్లి కార్యాలయంలో శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో చదువుకొని తన ప్రతిభను చాటుకున్నాడనిపై చదువులు చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఊరే శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.


బాటసింగారం గ్రామ పంచాయితీ పరిధిలోని సర్వేనెంబర్ 10 ఇందిరమ్మకాలనీలో పేదలు నిర్మించుకుని రెగ్యులరైజేషన్ చేసుకున్న ఇండ్లను సోమవారం రెవెన్యూ అధికారులు కూలగొటిన ఇండ్లను మంగళవారం టిపిసిసి ఉపాధ్యక్షులు మల్‌రెడ్డి రంగారెడ్డి పరిశీలించి బాధితులకు భరోసా ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఎంపీపీ బుర్ర రేఖమహేందర్ గౌడ్, జడ్పిటిసి బింగి దేవదాస్‌గౌడ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, ఈసీ శేఖర్‌గౌడ్ మామ తదితరులు పాల్గొన్నారు. (ప్రభాతవార్త, పెద్దఅంబర్‌పేట)

## శునకాల దాడితో ప్రాణాలు పోతున్న అధికారులకు పట్టదా...!

### ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులు...


దాడిలో గాయపడ్డ బాలికను పరామర్శించిన సునీల్ తదితరులు

**తుర్కయాంజల్, మే 16 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ 18వవార్డులో సోమవారం కుక్కల దాడిలో గాయపడ్డ బాలిక అనన్యను కౌన్సిలర్, తెలంగాణ పిసిసి సభ్యులు కాకుమాను సునీల్, మున్సిపాలిటీ కమిషనర్ సాబేర్ అలీ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ ఇటువంటి సంఘటన జరగడం చాలా బాధాకరమని చెప్పారు. కుక్కలను సంతతిని అరికట్టడానికి పాలకవర్గం 4 నెలల క్రితమే బ్లూ క్రాస్ సంస్థతో ఒప్పందం చేసుకొని ప్రత్యేక నిధులు కేటాయించిందని, 2 నెలల క్రితం కొహెడలో కుక్కలకు వాక్సిన్ వేయడానికి ఒక స్థలం ఏర్పాటు చేయడానికి పాలకవర్గం నిర్ణయించిందని తెలిపారు.కుక్కలను నియంత్రించడం చాలా సున్నితమైన విషయంగా మారిందని, ఒక పద్ధతి ప్రకారం చేస్తున్నారన్నారు. బ్లూక్రాస్ వాళ్లు వచ్చి కుక్కలను నియంత్రించడానికి చర్యలు చేపడుతున్న కానీ వాటి సంఖ్యలో ఎలాంటి మార్పు రావడంలేదన్నారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా తక్షణమే కఠినమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. పాపకు మెరుగైన వైద్యం అందింపజేస్తామని, అదేవిధంగా పాపకు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో మర్తయ్య, ఆరోగ్యం, రాజు, అంతోని, మరియారాజు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## దేశానికి ఆదర్శం తెలంగాణ ప్రజా పథకాలు : మంత్రి సబితాఇంద్రారెడ్డి


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

**ఎల్.బి.నగర్, మే 16 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణరాష్ట్రంలో ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. సరూర్‌నగర్‌మండల రెవెన్యూకార్యాలయం ఆవరణలో మంగళవారం సాయంత్రం షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు మంత్రి సబితా ఇంద్రారెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అనేక ప్రజాపతకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న వేలకోట్ల రూపాయల అభివృద్ధి పనులు ఇతర రాష్ట్రాలకు ఆదర్శం అన్నారు. పెనుబారంగా మారిన పెండ్లిల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేకంగా ఆలోచన చేసి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి పథకాన్ని ప్రవేశపెట్టి పేదలకు ఆర్థికంగా బాసటగా నిలుస్తున్నారని తెలిపారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రాష్ట్రంలోని అనేకమంది పేదలకు అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన వైద్యం అందేవిధంగా నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. అదే విధంగా కోట్లాది రూపాయలు వెచ్చించి మహేశ్వరం నియోజకవర్గంలో ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు ఎగ్గే మల్లేశం, బొగ్గరపు దయానంద్, ఆర్డీఓ సూరజ్, తహసిల్దార్ జయశ్రీ, నియోజకవర్గ బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నాగేష్, మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనితా దయాకర్ రెడ్డి, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్త కుటుంబానికి అండగా కాంగ్రెస్ పార్టీ... మల్ రెడ్డి రాంరెడ్డి

**వనస్థలిపురం, మే 16 ప్రభాతవార్త :** ప్రతి కార్యకర్త కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి అన్నారు. ఇటీవల చంపాపేట్ డివిజన్‌కి చెందిన ఖాజా పాషా మరణించిన సందర్భంగా వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరఫున రెండు లక్షల రూపాయల బీమా చెక్కును ఆయన చేతుల మీదుగా చంపాపేట్ డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, మతిన్‌భాయ్, మసూర్‌అలీ సమక్షంలో అందజేశామన్నారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త చనిపోతే ఆ కుటుంబానికి బీమా డబ్బులు అందజేస్తుందని తెలిపారు. ఇతర రాష్ట్రాలకి భిన్నంగా టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అధిష్టానంతో మాట్లాడి మరణించిన కార్యకర్తలకుటుంబాలకి బీమా చెక్కు లను సకాలంలో అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 4 కోట్ల భీమా సొమ్మును కార్యకర్తలకు అందించామని, ఇంకొక 2 కోట్ల రూపాయలు బీమా సొమ్మును కూడా మరణించిన కార్యకర్తల కుటుంబానికి త్వరలో అందజేస్తుందని తెలిపారు. అలాగే నమ్మిన కార్యకర్తలను పార్టీ ఎల్లవేళలా గుర్తిస్తుందని అందులో భాగంగా చంపాపేట డివిజన్ బీసీ సెల్ అధ్యక్షుడిగా ఉమేష్‌బాబుని, ఓబిసి సెల్ అధ్యక్షుడిగా కారుకొండ శివను నియమించి కాంగ్రెస్ పార్టీ తరఫున నియామకపు పత్రాన్ని అందజేయడం జరిగిందని తెలిపారు. కార్యకర్తలంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సునీల్, మసూర్ అలీ, కిరణ్, శివ, వెంకటేష్, యాదగిరి, జంగయ్య గౌడ్, సుజాత, యాదమ్మ, అలివేలు, మాధురి తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ప్రోత్సాహం : బండారి లక్ష్మారెడ్డి


విజేతలకు షీల్డ్, నగదును అందజేస్తున్న బండారి లక్ష్మారెడ్డి

**కుషాయిగూడ మే 16 ప్రభాతవార్త :** యువత తలుచుకుంటే సాధ్యం కానిది లేదని, యువతకు పూర్తిస్థాయిలో ప్రోత్సాహం అందిస్తామని బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి గారు పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్‌లో బిఎల్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ 3 రోజుల పాటూ ఫ్రీ ఎంట్రీ తో సాగిన క్రికెట్ ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొని ఫైనల్ విజేత ప్రవీణ్ రెడ్డి( చక్రిపురం) టీమ్‌కి 50,000/- రూపాయల నగదుతో పాటు షీల్డ్, రన్నరప్ రాజశేఖర్( కుషాయిగూడ) జట్లకు 20 వేల రూపాయలు, బహుమతులు అందించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో 36 క్రికెట్ జట్లు పోటీపడ్డాయని, క్రీడల్లో గెలుపోటములు సహజమని, మరింత ఉత్సాహంతో ముందుకు సాగాలన్నారు. క్రీడలతో మానసిక ఉత్సాహంతో పాటు శరీరం దారుఢ్యం లభిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కప్ ఆర్గనైజర్ చర్లపల్లి డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్, బిఎల్ఆర్ ట్రస్ట్ ప్రతినిధి నేమూరి మహేష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పద్మారెడ్డి, కాసుల ఆనంద్, కడియాల బాబు, దశరథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.